ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
శనివారం 27 సెప్టెంబరు 2025 | 5





కిటకిటలాడిన.. దేవిచౌక్

రాజమహేంద్రవరం దేవిచౌక్‌లో ఐదో రోజు అమ్మవారు బాలా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి కుంకుమ పూజలు, అర్చనలు జరిగాయి. భక్తులు పెద్దఎత్తున అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, వీర్రాఘవమ్మ దంపతులు దర్శించుకున్నారు. - రాజమహేంద్రవరం సిటీ





బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో!

బతుకమ్మ పండుగ తెలంగాణలో ఫేమస్.. దసరా ఉత్సవాల్లో ఘనంగా చేస్తారు.. పువ్వులతో బుట్టలు అలంకరించి వాటిని నెత్తిన పెట్టుకుని అమ్మవారిని బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో..బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ ప్రార్థిస్తారు..ఆ సంస్కృతి మన జిల్లాలోనూ కనిపిస్తోంది.. గోకవరం మండలం రంపయర్రంపాలెంలో శుక్రవారం బతుకమ్మ పండుగను ఇలా జరుపుకున్నారు.. - గోకవరం



మంత్రి అచ్చెన్నాయుడికి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరావు వినతి

నా తర్వాత సీనియర్ మోస్ట్ ఎమ్మెల్యే బుచ్చయ్యచౌదరి

అసెంబ్లీలో సీఎం చంద్రబాబు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నేను రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరిని అభినందిస్తున్నా. సభలో నా తర్వాత సీనియర్ మోస్ట్ ఎమ్మెల్యే. ఆయన స్ఫూర్తి కూడా. మొదటి నుంచి చూస్తున్నా.ఏదైనా చెబితే మొత్తం సబ్జెక్ట్ నేర్చుకుని మాట్లాడతారని సీఎం చంద్రబాబు శుక్రవారం అసెంబ్లీలో ప్రకటించారు. ఎమ్మెల్యే,టీడీపీ సీనియర్ నేత గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ చంద్రబాబునుద్దేశించి మిమ్మల్ని చూస్తుంటే అప్పుడే నేను ఎందుకుపుట్టాను.. మరో 40 ఏళ్ల తర్వాత పుట్టి ఉంటే బాగుండును. ఎందుకంటే మీరు తెచ్చిన డిజిటల్, ఇతర టెక్నాలజీలు నేర్చుకోవడానికి చచ్చిపోతున్నాం..అమెరికాలో ఉన్న మనవళ్లకు ఫోన్ చేసి వాళ్ల ద్వారా నేర్చుకుంటున్నా. రాష్ట్ర ప్రగతికి అవసరమైన సంస్కరణలు మీరే తెచ్చారు. ఆంధ్ర,తెలంగాణ బిడ్డలంతా ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి మీ నిర్ణయాలే కారణమని చెప్పారు. రాక్షసులు తిరిగి వస్తారనే ఆలోచన ఉండకూడదు. 20 నుంచి 30 ఏళ్లు సెంట్రల్ జైలే వారికి గతి అనేది తెలియాలన్నారు.

ఇనామ్ భూముల రైతుల ఇబ్బందులు తొలగించాలి

ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు,సెప్టెంబరు 26 (ఆంధ్ర జ్యోతి): కొవ్వూరు మండలం ఆరికిరేవుల, నందమూరు, పశివేదల, వేములూరు గ్రామాల్లో రైతులు ఇనామ్ భూములకు సంబంధించి ఇబ్బందులను తొలగించాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కోరారు. అసెంబ్లీలో శుక్రవారం మాట్లాడారు.ఇనామ్ భూములకు గతంలో మాదిరిగా అడంగల్, 1బీలు ఇచ్చి లావాదేవీలు జరిగేటట్లు చూడాలన్నారు. గడచిన ప్రభుత్వం నాడు-నేడు పథకం కింద రూ.కోట్లాది రూపాయలతో పాఠశాల భవన నిర్మాణాలు చేపట్టి అసంపూర్తిగా వదిలేశా రన్నారు. నాడు నేడు నిధుల వినియోగంపై దర్యాప్తు చేపట్టాలని కోరారు.అనంతరం వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి అచ్చెన్నాయుడిని కలిసి తాళ్లపూడి మండలం పెద్దేవంలో థైలేరియాసిస్ వ్యాధితో గేదెలు మృతిచెందిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వినతిపత్రం అందజేశారు.



ఇసుక రవాణాపై సమీక్షిస్తున్న ఆర్డీవో

ఇసుక అక్రమ రవాణాపై 24 గంటలు నిఘా

కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత

కొవ్వూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు 24 గంటలు పనిచేసేలా టాస్క్‌ఫోర్స్ బృందాలు ఏర్పాటు చేస్తున్నట్టు కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం డివిజన్ స్థాయిలో ఇసుక స్టాక్ పాయింట్, బోట్స్‌మేన్ సొసైటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద రోడ్డుపై ఐదు లారీలకు మించి ఉండకూడదన్నారు.ఇసుక లారీపై టార్పాలిన్ కప్పకపోతే లారీ యజమానులతో పాటు ఇసుకర్యాంపుల వారికి జరిమానాలు విధిస్తామన్నారు. రోడ్లపై పడిన ఇసుకను ఎప్పటికప్పుడు ర్యాంపు నిర్వాహకులు శుభ్రం చేయించాలన్నారు. బల్క్ బుకింగ్‌ల వివరాలు తప్పనిసరిగా ఆర్డీవో కార్యాలయానికి అందజేయాలన్నారు.ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు 24 గంటలు టాస్క్‌ఫోర్సు బృందాలు పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.మైన్స్ ఏడీ ఫణిభూషణ్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా నుంచి తెలంగాణకు భారీగా ఇసుక తరలింపుపై విచారణ కొనసాగుతుందన్నారు.చింతలపూడి ప్రాంతానికి ఏకంగా 1.28 లక్షల టన్నులు ఇసుక తరలించినట్టు తెలిపారు. ఒకే ఆధార్‌కార్డుతో 20 నుంచి 30 వేల టన్నుల ఇసుక బుకింగ్ చేసుకుంటున్నారన్నారు. బల్క్ బుకింగ్ పేరుతో ఇసుక అక్రమంగా తరలిపోతుందన్నారు. ఓవర్ లోడింగ్‌పై చర్యలు తప్పవన్నారు.



అభివృద్ధికి.. జల..బాట!

అసెంబ్లీలో జలరవాణాపై చంద్రబాబు కీలక ప్రసంగం

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

ఓడరేవులు, నదీ జల రవాణాతో పారిశ్రామికంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు అద్భుత భవిష్యత్తు లభించబోతోందని సీఎం చంద్రబాబు అన్నారు. అత్యంత చవకైన కార్గో రవాణా ద్వారా పారిశ్రామిక అభివృద్ధి పెద్ద ఎత్తున జరగనుందని వివరించారు. ఈ మేరకు అసెంబ్లీలో సీఎం శుక్రవారం పారిశ్రామిక, ఓడరేవు, లాజిస్టిక్ రంగాల్లో కొనసాగుతున్న పెట్టుబడులు, భవిష్యత్ ప్రాజెక్టులను కూలంకషంగా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా విశ్లేషించారు. తీరప్రాంతాన్ని గుజరాత్ తర్వాత దేశంలో ఆంధ్రప్రదేశ్ సమర్థవంతంగా వినియోగించుకుంటోందన్నారు.

సీఎం ఏమన్నారంటే..

కాకినాడ గేట్‌వే పోర్టు(కేజీపీఎల్) రూ.2,621 కోట్లతో చేపట్టిన కొత్త పోర్టు నిర్మాణం వచ్చే ఏడాది డిసెంబరు నాటికి పూర్తవుతుందన్నారు. ఈ కొత్త పోర్టు అందుబాటులోకి వస్తే ఏటా 16 మిలియన్ మెట్రిక్ టన్నుల కార్గో హ్యాండ్లింగ్ జరుగుతుందన్నారు. ప్రస్తుతం పోర్టులో మూడు బెర్తుల నిర్మాణం జరుగుతోంది. ఒకటి బొగ్గు దిగుమతికి, మరో రెండు బెర్త్‌లు అన్ని రకాల కార్గో ఎగుమతి,దిగుమతులకు వినియోగిస్తున్నారన్నారు. వచ్చే ఏడాది డిసెంబరుకు ఇది అందుబాటులోకి వస్తే మౌలిక వసతులు, పారిశ్రామికంగా ఆ ప్రాంతం అభివృద్ధి జరుగుతుందని సీఎం వివరించారు. ఇదికాకుండా ప్రస్తుతం కార్యకలాపాలు నిర్వహిస్తున్న కాకినాడ సీపోర్టు ద్వారా ఏటా 26 మిలియన్ మెట్రిక్ టన్నులు, కాకినాడ యాంకరేజ్ పోర్టు ద్వారా 4 మిలియన్ మెట్రిక్ టన్నులు, కోనసీమలోని రవ్వ పోర్టు ద్వారా 2 మిలియన్ మెట్రిక్ టన్నుల ముడిచమురు కార్గో కార్యకలాపాల ద్వారా జరుగుతున్నాయన్నారు. భవిష్యత్తులో ఈ పోర్టుల ద్వారా వ్యాపారం పెరుగుతుందన్నారు.

ప్రతిపాదనలు సిద్ధం..

ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో గోదావరి కాలువలపై సరుకు రవాణా, పర్యాటక యాత్రలకు పది రూట్లను ఏపీ ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ ఎంపిక చేసి ప్రతిపాదనలు సిద్ధం చేసింది. నేషనల్ వాటర్‌వే-4 ద్వారా కాకినాడ కెనాల్, గోదావరి మీదుగా సిమెంట్ ఫ్యాక్టరీలు, పవర్ ప్లాంట్లకు ముడిసరుకు సరఫరాకు ప్రణాళికలు తయారు చేసింది. ఈ మేరకు కాకినాడ- రాజమహేంద్రవరం, రాజమహేంద్రవరం- విజయవాడ కెనాల్, రాజమహేంద్రవరం- భద్రాచలం, పురుషోత్తపట్నం-భద్రాచలం గోదావరి మార్గం, పురుషోత్తపట్నం-పోలవరం,నర్సాపూర్ వెస్ట్- అంతర్వేది- సఖినేటిపల్లి, కోటిపల్లి-ముక్తేశ్వరం మార్గాలను ఎంపిక చేసింది. విమానయాన రంగాన్ని ప్రోత్సహించడంలో భాగంగా రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టు రన్‌వే విస్తరణ కూడా చేపట్టామని సీఎం వివరించారు.

ఓఎన్జీసీ, గెయిల్‌పై వాడివేడిగా..

ఉమ్మడి జిల్లాలో చమురు, గ్యాస్ కార్య కలాపాలు నిర్వహిస్తోన్న ఓఎన్జీసీ, గెయిల్ సంస్థల తీరుపై అసెంబ్లీలో కోనసీమ జిల్లా ఎమ్మెల్యేలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఓఎన్జీసీ, గెయిల్ గ్యాస్, చమురు పైపులైన్ల కారణంగా గోదావరి తీర ప్రాంతం దెబ్బతిందని, ప్రధానంగా కోనసీమ జిల్లాలో భూగర్భ జలాలు పాడైపోయాయని రాజోలు ఎమ్మెల్యే వరప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రెండు కంపెనీలు కనీసం సీఎస్సార్ అమలులోను బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నాయన్నారు. ఈ సంస్థల వల్ల అనేక చోట్ల భూమి కుంగిపోయి డ్రైనేజీ సమస్యలు వస్తున్నాయని వివరించారు. దీనిపై శాస్త్రీయ అధ్యయనం జరగాలని డిమాండ్ చేశారు. పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి మాట్లాడుతూ ఈ రెండు సంస్థలు ఏర్పాటయ్యే సమయంలో స్థానికులకు ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఆ తర్వాత మోసగించాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీరిద్దరి ప్రశ్నలకు మంత్రి బీసీ జనార్దనరెడ్డి అసెంబ్లీలో సమా ధానం ఇచ్చారు. ఎమ్మెల్యేలు లేవనెత్తిన సమస్యలపై త్వరలో అధికారుల ద్వారా నివేదిక రప్పి స్తామని, తదనుగుణంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. భూమి కుంగిపోవడం, సముద్రంలోకి వెళ్లకుండా మురుగునీటి డ్రైన్లు పొంగుతున్నాయన్న సమస్యపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సీఎస్సార్ నిధులు ఖర్చు చేయడం లేదనే విషయంపై నివేదికలు రప్పిస్తామని తెలిపారు.

జల రవాణాపై ఇదీ లెక్క..

ఉమ్మడి జిల్లాలో కాకినాడ నుంచి ఏలూరు కాలువ వరకు ఇన్‌లాండ్ వాటర్ కింద నదీ మార్గాల్లో కార్గో తరలింపుపైనా ప్రణాళికలు సిద్ధం చేసినట్టు వివరించారు. గోదావరి నదీ ద్వారా కృష్ణాకు, కాకినాడ-ఏలూరు కాలువ, కాకినాడ-బకింగ్‌హాం కెనాల్ నుంచి చెన్నైకు, గోదావరి ద్వారా మహారాష్ట్రకు జల రవాణాకు ఎంతో ఆస్కారం ఉందని వివరించారు. నదులపై కాలువ మార్గాల ద్వారా అనేక పరిశ్ర మలకు కార్గో ఏవిధంగా తరలించవచ్చనే దానిపై ఇప్పటికే టెండర్లు పిలిచామని చెప్పారు. ఈ మార్గాలను అభివృద్ధి చేయడానికి కొందరు ముందుకు వస్తున్నారన్నారు. రవాణా రంగం ఖర్చుల విషయానికి వస్తే టన్ను కార్గో రవాణా ఖర్చుకు రోడ్డు మార్గం ద్వారా రూ.3.78 అవు తుంటే.. సముద్రమార్గం రవాణాకు రూ.1.80, నదీ జలరవాణాకు రూ.3.30 అవుతుందన్నారు.



- ఓడరేవు, లాజిస్టిక్ అభివృద్ధి
- రూ.2,621 కోట్లతో గేట్‌వే పోర్టు
- వచ్చే ఏడాది డిసెంబర్‌కు పూర్తి
- జలరవాణాకు కసరత్తు
- విమానాశ్రయ రన్‌వే విస్తరణ
- ఓఎన్జీసీ, గెయిల్ విధ్వంసంపై చర్చ
- ఉమ్మడి జిల్లాకు అద్భుత భవిష్యత్తు



రాజమండ్రిలో ట్రాఫిక్ అస్తవ్యస్తం

ఎటెళ్లాలి!

నగరంలో తప్పని ట్రాఫిక్ ఇక్కట్లు

- నగరంలో బయటకెళితే చింతే
- ఎక్కడా పనిచేయని సిగ్నల్స్
- జంక్షన్లలో తప్పని టెన్షన్
- పెరుగుతున్న ప్రమాదాలు
- భయపడుతున్న వాహనదారులు
- మరో వైపు ట్రాఫిక్ పోలీసుల కొరత

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ట్రాఫిక్ తలపోటుగా మారింది. శాఖల సమన్వయ లోపం, ట్రాఫిక్ పోలీసుల కొరతతో జిల్లా కేంద్రంలో నియంత్రణ కోల్పోయింది. రాజమహేంద్రవరంలో మరీ అస్తవ్యస్తంగా మారింది. ట్రాఫిక్ నియంత్రణలో ప్రధాన భూమిక పోషించే జంక్షన్లలో సిగ్నల్స్ వెలిగితే సంబరమే. నగరాలు/పట్టణాల్లో దారితప్పిన ట్రాఫిక్ వాహనదారులను విసుగెత్తిస్తోంది. ట్రాఫిక్ చిక్కుల నుంచి రాజమహేంద్రవరాన్ని బయటపడేయడం ఓ పెద్ద చిక్కుముడిగా మారింది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతి నిధులు ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపించాల్సిన అవసరత అత్యవసరంగా కనిపిస్తోంది.

సమన్వయ లోపం

నగరంలో పది కూడళ్లలో విద్యుత్, మరో పది జంక్షన్లలో సోలార్ సిస్టంతో సిగ్నల్స్ పని చేస్తాయి. వీటి నిర్వహణ బాధ్యత మునిసిపల్ కార్పొ రేషన్‌లోని పట్టణ ప్రణాళికా విభాగం చూసుకుంటుంది. కాంట్రాక్టర్లతో అగ్రిమెంట్లు చేసుకోవడం వరకూ బాగానే ఉన్నా.. నిర్వహణలో అజమాయిషీ అంతంత మాత్రంగా ఉండడంపై విమర్శలు వినవస్తున్నాయి. పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టంలు పడుకునే ఉంటున్నాయి.

సిగ్నల్స్ వెలిగితే అదృష్టమే..

జిల్లాలోని అధికశాతం కూడళ్లు, ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాల్లో అసలు ట్రాఫిక్ సిగ్నల్సే లేవు. కొవ్వూరు, నిడదవోలు పట్టణాల్లోనూ అదే పరిస్థితి.ఒకవేళ ఉన్నా నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంటోంది. సాక్షాత్తూ కలెక్టర్, ఎస్పీ, మునిసిపల్ కమిషనర్, విద్యుత్ ఎస్ఈ రోజూ తిరిగే జిల్లా కేంద్రంలో కూడా సిగ్నల్స్ వాటి ఇష్టానుసారంగా పనిచేస్తాయి. ప్రజాప్రతినిధులు ఇదే రోడ్లపై సంచరిస్తున్నా వారికి ఈ సమస్య కనబడడం లేదు. రాజమహేంద్రవరంలోని ముఖ్య కూడళ్లయిన కంబాలచెరువు,ఐటీ ఆఫీస్, లాలాచెరువు, డీటీసీ జంక్షన్, శ్యామలా సెంటర్, వీఎల్ పురం జంక్షన్, జాంపేట, దేవీచౌక్, గోకవరం బస్టాండ్, కోటిపల్లి బస్టాండ్, తాడితోట, వీఎల్‌పురం వద్ద సిగ్నల్స్ ఉన్నా ఎక్కువ సమయం నిద్దరోతూనే ఉంటాయి. ఉదాహరణకు డీటీసీ జంక్షను బ్లాక్ స్పాట్ లిస్టులో ఉంది.కానీ ఇక్కడ కనీసం లైటింగ్ ఉండదు. సిగ్నల్ దోబూచులాట మామూలే.

అభివృద్ధి పేరుతో..

జిల్లా కేంద్రమైన తర్వాత రాజమహేంద్రవరంలో గతం కంటే ట్రాఫిక్ పెరిగింది.. ఎక్కడైనా ట్రాఫిక్ పెరిగితే ఇబ్బందులు అధిగమించడానికి రోడ్లు, కూడళ్ల వెడల్పు చేస్తారు. కానీ వైసీపీ ప్రభుత్వంలో జిల్లాలో అభివృద్ధి పేరుతో రోడ్లు, జంక్షన్లు కుచించుకుపోయేలా చేశారు. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు పెరిగిపోయాయి. వాటికి అస్తవ్యస్త సిగ్నల్స్ నిర్వహణ ఆజ్యం పోస్తోంది. ఉదాహరణకు రాజమహేంద్రవరంలో కంబాలచెరువు, ఐటీ ఆఫీస్ ఏరియాల్లో జంక్షన్ల అభివృద్ధి పేరుతో చేసిన పనుల వల్ల వాహనదారులకు ఇబ్బందులెక్కువయ్యాయి. సాధారణంగా ట్రాఫిక్ నియంత్రణకు ట్రాఫిక్ సలహా కమిటీ ఉంటుంది. దీనిలో మునిసిపాలిటీ, పోలీస్, ఆర్అండ్‌బీ, రెవెన్యూ, విద్యుత్, నేషనల్ హైవేస్ తదితర శాఖలతో పాటు వ్యాపారులు ఉంటారు. ట్రాఫిక్ సమస్యలపై శాశ్వతమైన నిర్ణయాలను కమిటీ తీసుకుంటుంది. ఆ మేరకు చర్యలు చేపట్టి ట్రాఫిక్ ఇబ్బందులను అధిగమిస్తారు. అయితే,అసలు ట్రాఫిక్ సలహా కమిటీలు ఉన్నాయా? అంటే సమాధానం ముఖం చాటేస్తోంది.

ట్రాఫిక్ పోలీసుల కొరత..

రాజమహేంద్రవరం నిత్యం రద్దీగానే ఉంటుంది. రోజుకు లక్షల వాహనాలు సంచరిస్తూ ఉంటాయి.కానీ ట్రాఫిక్‌ని నియంత్రించే పోలీసుల కొరత తీవ్రంగా ఉంది. ట్రాఫిక్ విభాగానికి డీఎస్పీ, ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్ఐలు, ఒక సార్జెంట్ ఉండాలి.కానీ చాలా సీట్లు ఖాళీగా ఉన్నాయి. కిందిస్థాయి సిబ్బంది 25 మంది కావాల్సి ఉంది. సెంట్రల్ జోన్ డీఎస్పీకి చాలా కాలంగా ట్రాఫిక్ బాధ్యతలు అప్పగించారు. ఆయన ఇటీవల ఉద్యోగ విర మణ పొందారు. ఆ పోస్టును భర్తీ చేయలేదు. ఇద్దరు సీఐలకు ఒకరు అవినీతి ఆరోపణలపై ఇంటికెళ్లారు.అప్పటి నుంచీ ఒక సీఐ మాత్రమే చక్కబెడుతున్నారు. ఐదుగురు ఎస్ఐలు చేయాల్సిన పనులను ముగ్గురు మోస్తున్నారు. ట్రాఫిక్ నియంత్రణలో క్షేత్రస్థాయిలో కీలక భూమిక పోషించే హోంగార్డులు, కానిస్టేబుల్స్ కొరత ఉంది.

కొత్త బైక్‌లు వచ్చాయ్!

జిల్లా పోలీసులకు విధుల్లో అవసరత నిమిత్తం 42 కొత్త ద్విచక్ర వాహనాలను ప్రభుత్వం కేటాయించింది. వీటిని ఎస్పీ నరసింహ కిశోర్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం టెస్ట్ డ్రైవ్ చేశారు.కొత్త వాహనాలను శాంతి భద్రతలు, స్పెషల్ బ్రాంచ్, ట్రాఫిక్ పోలీసులకు ఇచ్చామన్నారు. కొత్తగా 19 పల్సర్, 20 అపాచీ, 2 రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌లు, ఒక ప్లెజర్ స్కూటర్ వచ్చాయన్నారు. - (రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

రాజానగరం, అనపర్తి ఏఎంసీలకు కమిటీలు

అనపర్తి చైర్మన్‌గా సూర్యకుమారి



అనపర్తి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : అనపర్తి ఏఎంసీ చైర్‌పర్సన్‌గా పెదపూడి మండలం గొల్లలమామిడాడకు చెందిన జుత్తుక సూర్యకుమారి నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది.గౌరవ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, వైస్ చైర్మన్‌గా కోనాల వెంకటరెడ్డి, డైరెక్టర్లుగా యామల చిన్నమ్మ, సిరపల్లి లక్ష్మి, ఒంటిమి గౌతమి, పెండెం అప్పన్న, గంగుమళ్ల వెంకట తలుపులమ్మ దేవి, తేతలి సూర్యనారాయణరెడ్డి, నడింపల్లి సూర్యకుమారి, తేనెల కృష్ణవేణి, బోగాడి వెంకటరమణ, ఎన్ఆర్‌కె.ప్రసాదరెడ్డి, మద్దిపూడి సత్యనారాయణ, పంచికట్ల నాగరాజు, ఇందల వీరబాబు, అనపర్తి సర్పంచ్ వారా కుమారి, పలువురు అధికారులను నియమించింది. చైర్ పర్సన్‌గా నియమితులైన సూర్యకుమారి పెదపూడి ఎంపీపీగా పనిచేశారు.ప్రస్తుతం అనపర్తి నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలిగా ఉన్నారు.ఆమె భర్త కృష్ణ పెదపూడి మండల టీడీపీ అధ్యక్షుడిగా ఉన్నారు.పదవికి వన్నె తెచ్చేందుకు కృషి చేస్తానన్నారు.

రాజానగరం చైర్మన్‌గా తనకాల

దివాన్‌చెరువు, సెప్టెంబరు26 (ఆంధ్రజ్యోతి) : రాజానగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కోరుకొండ మండలానికి చెందిన తనకాల వెంకటరమణమ్మ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. గౌరవ చైర్మన్‌గా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణను నియమించింది. సభ్యులుగా ముక్కాదేవి దుర్గ, బల్లేని కనకమహాలక్ష్మి, పెనుగొండ శ్రావణలక్ష్మి, మద్దాల అచ్చమ్మ, పెమ్మనబోయిన వెంకటేష్, కలుం భాగ్యలక్ష్మి, గొంతిన సూరిబాబు, సైతిని లక్ష్మి, వాకపల్లి అప్పలరాజు, బొర్రా వీరబాబు, యర్రంశెట్టి పోలారావు, దండమూడి రవికుమార్, యడవిల్లి సూర్యచక్రం, యర్రంశెట్టి శ్రీనును నియమించారు. దివాన్‌చెరువు పీఏసీఎస్ అధ్యక్షుడు, వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్, తూర్పుగోనగూడెం సర్పంచ్, జిల్లా వ్యవసాయ ట్రేడ్ మార్కెటింగ్ అధికారిని సభ్యులుగా నియమించినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.





కొత్త బైక్‌లతో పోలీసులు ర్యాలీ.. బుల్లెట్ నడుపుతున్న ఎస్పీ నరసింహ కిశోర్

రత్నగిరిపై అగ్నిప్రమాదం

ఫ్యాన్సీషాపు గొడౌన్ దగ్ధం

రూ.10 లక్షల ఆస్తినష్టం



పశ్చిమ రాజగోపురం వద్ద దగ్ధమవుతున్న గొడౌన్

అన్నవరం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో శుక్రవారం వేకువజామున 4 గంటల ప్రాంతంలో అగ్నిప్రమాదం సంభవించింది. షార్టు సర్క్యూట్ కారణంగా ఫ్యాన్సీషాపు గొడౌన్ అగ్నికి ఆహుతైంది. ఈ మంటలు పక్కనున్న రెండు గొడౌన్‌లకు వ్యాపించగా అక్కడ స్వల్ప నష్టం కలిగింది. తుని అగ్నిమాపక సిబ్బంది ఫైరింజిన్ సహాయంతో మంటలను అదుపు చేశారు. ఫ్యాన్సీ షాపును మార్నీడి భాస్కరరావు లైసెన్స్ హక్కుపొందారు. సుమారు రూ.10లక్షల ఆస్తి నష్టం సంభవించినట్టు తెలిపారు. సంఘటనా స్థలాన్ని ఈవో వీర్ల సుబ్బారావు, పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి పరిశీలించారు. దీనిపై నివేదికను దేవదాయ కమిషనర్‌కు పంపుతామని లీజుల విభాగం అధికారులు తెలిపారు. నిబంధనల మేరకు గొడౌన్ కేటాయించారా లేదా అనేదానిపై ఈవో సంబంధిత అధికారులను అడగగా సంబంధింత ఫైలు కనిపించలేదని చెప్పినట్టు సమాచారం.

కపిలేశ్వరపురంలో 25 గ్రాముల బంగారం, 32 తులాల వెండి చోరీ

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురంలోని చప్పిడి శ్యాంప్రసాద్ ఇంట్లో 25 గ్రాముల బంగారం, 32 తులాల వెండిని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్టు అంగర ఏఎస్‌ఐ ఆర్.సత్యనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.... గ్రామానికి చెందిన చప్పిడి శ్యాంప్రసాద్, ధనలక్ష్మి దంపతులు మంగళవారం బంధువుల ఇంటికి వెళ్లారు. గురువారం సాయంత్రం ఇంటికి తిరిగి రాగా తలుపు తాళాలు, బీరువా తాళాలు, పగలగొట్టి బంగారం, వెండి దొంగతనం జరిగినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం మండపేట సీఐ దొరరాజు, ఆధ్వర్యంలో జిల్లా క్లూస్‌టీం సంఘటనా స్థలంలో వేలిముద్రలు సేకరించారు. చప్పిడి ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్‌ఐ తెలిపారు.


వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీం

లారీ చోరీపై కేసు

రాజానగరం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాలచర్లలో హైవే రహదారిని ఆనుకుని ఉన్న కాటా వద్ద పార్క్ చేసిన లారీ చోరీకి గురైందని పోలీసులు శుక్రవారం తెలిపారు. వివరాల ప్రకారం.. దివాన్‌చెరువుకు చెందిన అబ్బిరెడ్డి నాగేశ్వరరావుకు పాలచర్ల పంచాయితీలో హైవేపై ఎఎస్ఆర్ కాటా ఎదురుగా శ్రీకృష్ణ ఇన్ఫ్రా పేరుతో లారీ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీస్ ఉంది. గణేశ్వరరావు బంధువులను కలిసేందుకు హైదరాబాద్ వెళ్తూ తన నాలుగు లారీలను కాటా ఎదురుగా గురువారం పార్క్ చేశాడు. రాత్రి పని ముగించుకుని ఇంటికి వెళ్లి శుక్రవారం ఉదయం 11గంటలకు వెళ్లి చూసేసరికి షాప్ దగ్గర నాలుగు లారీలకు మూడు మాత్రమే ఉన్నాయి. ఏపీ39 డబ్ల్యూసీ 7729 నెంబరు గల లారీ కనపించక ఎవరో దొంగిలించుకుపోయారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రాజానగరం ఎస్‌ఐ కె.ప్రియకుమార్ కేసు నమోదు చేశారు.

అన్నవరంలో గంజాయితో వ్యక్తి అరెస్ట్


గంజాయితో వ్యక్తిని పట్టుకున్న పోలీసులు

అన్నవరం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం జాతీయ రహదారిపై శుక్రవారం గంజాయి తరలిస్తున్న తమిళనాడు కాంచీపురానికి చెందిన ఉత్తమ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నామని అన్నవరం ఎస్‌ఐ హరిబాబు తెలిపారు. అతడి నుంచి 11 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితుడిని ప్రత్తిపాడు కోర్టులో హాజరుపరిచామన్నారు.

పాము కాటేస్తే.. పర్లేదని పూజలు

పరిస్థితి విషమించి ఆదివాసీ మృతి

ఎటపాక, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) పాము కాటుతో వలస ఆదివాసీ మృతి చెందిన ఘటన శుక్రవారం అల్లూరి జిల్లా ఎటపాక మండలం లక్ష్మీపురం పంచాయతీలోని చింతలపాడువలస గ్రామంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మడకం జోగయ్య (34) రోజు మాదిరిగానే ఇంట్లో నేలపై నిద్రించాడు. శుక్రవారం తెల్లవారుజామున జోగయ్యను పాము కాటేసినట్టు కుటుంబ సభ్యులకు చెప్పాడు. కానీ పర్లేదులే అన్నట్టు జోగయ్యను ఆసుపత్రికి తీసుకెళ్లకుండా మంత్రాలతో పూజలు చేసి నాటు వైద్యంతో ఇంట్లోనే ఉంచి సపర్యలు చేశారు. దీంతో ఆరోగ్య పరిస్థితి విషమించి జోగ య్యా మధ్యాహ్నం ఇంటి వద్దే మృతిచెందాడు. మృతుడికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. నెలరోజుల క్రితం జోగయ్య దంపతులకు మగ బిడ్డ పుట్టాడు. దీంతో ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది.


మృతిచెందిన జోగయ్య

కలువ పువ్వుల కోసం చెరువులోకి దిగి..

సాయంత్రానికి శవమై తేలి..

గొల్లప్రోలు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పూజ నిమిత్తం కలువ పువ్వుల కోసం చెరువులోకి దిగి వ్యక్తి గల్లంతయ్యాడు. సాయంత్రానికి మృతదేహం లభ్యమైంది. కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణంలోని రైల్వే స్టేషన్ వీధికి చెందిన మడబాల వరప్రసాద్ (30) శుక్రవారం ఆలయంలో పూజల కోసం సూర్యుడు మంచినీటి చెరువులోకి దిగాడు. కలువ పువ్వులు కోసేందుకు ప్రయత్నిస్తుండగా ప్రమాదవశాత్తు జారిపడి గల్లంతయ్యాడు. దీంతో స్థానికులు, ఈతగాళ్లు, ఫైర్ సిబ్బంది గాలించారు. సాయంత్రానికి మృతదేహం లభ్యమైంది. అతడు తాపీ పనిచేసి జీవనం సాగిస్తూ ఉంటాడు. భార్యతో విడాకులు తీసుకున్నాడు. గొల్లప్రోలు ఎస్‌ఐ ఎన్.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


చెరువులో గాలిస్తున్న ఈతగాళ్లు, ఫైర్ సిబ్బంది


వరప్రసాద్ (ఫైల్)

స్వర్ణ శోభితం... మహాశక్తి యాగం

- కల్యాణ రాముని ఉత్సవ విగ్రహం, బంగారు పాదుకలు, బాణం ప్రదర్శన
- వీక్షించిన వేలాది మంది భక్తులు
- 60 కోట్లకు చేరిన లలితా సహస్రనామ కుంకుమార్చనలు


అయోధ్య శ్రీరాముని విగ్రహం, బంగారు పాదుకలు, ధనుర్బాణం


పూజిస్తున్న భక్తులు

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ శ్రీపీఠంలో మహాశక్తి యాగం శుక్రవారం ఐదో రోజుకు చేరుకుంది. అయోధ్య నుంచి తెచ్చిన బంగారు కల్యాణ రాముని విగ్రహం, బంగారు పాదుకలు, బంగారు ధనుర్బాణాన్ని వీక్షించి భక్తులు పులకించారు. వంద కోట్ల లలితా సహస్రనామ కుంకుమార్చన 60కోట్లకు చేరింది. సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. శ్రీపీఠం అధిపతి స్వామి పరిపూర్ణానంద భక్తులకు అనుగ్రహభాషణ చేశారు. మొదటిసారి మహాశక్తి యాగానికి శ్రీరాముడు పాదుకలు రాగా రెండోసారి ధనుర్బాణాలు వచ్చాయన్నారు. ఇప్పుడు బంగారు రాముడు, ఆయుధాలు రావడం యాదృచ్ఛికమన్నారు. మంత్రం ఫలించాలంటే మనసు ప్రధానమని, భావం దృఢంగా ఉంటే మంత్రం చెప్పకపోయినా ప్రకృతి దానికి సహకరిస్తుందన్నారు. అయోధ్యలో రూ.200 కోట్లతో కల్యాణ రాముడు గుడి నిర్మిస్తున్నామని, ఈ విగ్రహ శంకుస్థాపనకు స్వామీజీని ఆహ్వానిస్తున్నట్టు అయోధ్యకు చెందిన చల్లా శ్రీనివాసశాస్త్రి తెలిపారు. తెలుగువాళ్ల కోసం వసతి, ఉచిత భోజనం అమలు చేస్తున్నామన్నారు. ముందుగా వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ దుర్గాసూక్త, ప్రత్యంగిర హోమాలు నిర్వహించారు. అయోధ్య నుంచి తీసుకువచ్చిన బంగారు కల్యాణరాముని ఉత్సవ విగ్రహం, పాదుకలు, కోదండం, ధనుర్బాణం ప్రదర్శించారు. 50వేల మంది భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేశారు. సర్పవరం సీఐ బి.పెద్దిరాజు, ట్రాఫిక్ సీఐ రామారావు ఆధ్వర్యంలో ఎస్‌ఐలు పి.శ్రీనివాసకుమార్, ఆచార్యులు, రత్నం, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

మళ్లీ పెరుగుతున్న వరద

- భద్రాచలం వద్ద 44.7 అడుగుల నీటిమట్టం
- చింతూరు డివిజన్‌లో పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- అప్రమత్తంగా ఉండాలి : పీవో


ఉధృతంగా ప్రవహిస్తున్న సోకిలేరు వాగు వద్ద వాహనాదారుల పాట్లు

చింతూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గోదావరి, శబరి నదులు మళ్లీ పెరుగుతున్నాయి. దీంతో లోతట్టువాసులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం సాయంత్రం ఆరు గంటలకు భద్రాచలం వద్ద గోదావరి ఉధృతి 44.7 అడుగుల మేర ప్రవహిస్తోంది. కూనవరం వద్ద గోదావరి నది శబరి నదికి ఎగపోటు నివ్వడంతో శబరి ఉధృతి కూడా పెరుగుతోంది. దీంతో చింతూరు- వరరామ చంద్రపురం మండలాల నడుమ సోకిలేరు వాగు ఉధృతి పెరిగింది. ఈ క్రమంలో అటుగా రాకపోకలు నిలిచిపోయాయి. కూనవరం మండలంలోని కోండ్రాజపేట, టేకులబోరు నడుమ, వరరామ చంద్రపురం మండలంలో తుష్టివారిగూడెం అడవి వెంకన్నగూడెం నడుమ చింతరేవుపల్లి కన్నయ్యగూడెం నడుమ, ఎటపాక మండలంలోని నెల్లిపాక వీరాయిగూడెంల నడుమ కన్నాయిగూడెం గట్టుగూడెంల నడుమ చింతూరు మండలం, వరరామచంద్రపురం మండలాల నడుమ రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో లోతట్టు వాసులు అప్రమత్తంగా ఉండాలని చింతూరు ఐటీడీఏ పీవో శుభం నొక్వాల్ పేర్కొన్నారు. చేపల వేటకు ఎవరూ వెళ్లవద్దని ఆయన సూచించారు.


వరదనీటిలో గండిపోశమ్మ ఆలయం పై భాగం

వరద నీటిలోనే గండిపోశమ్మ ఆలయం

దేవీపట్నం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గత 3 రోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు భద్రాచలం వద్ద గోదావరి క్రమేపి పెరుగుతోంది. ముంపు పరివాహ ప్రాంతాలకు వరద నీరు చేరుతుంది. ప్రసిద్ధి పుణ్యక్షేత్రం మాతశ్రీ గండిపోశమ్మ అమ్మవారి ఆలయ పైభాగం వరకు వరద నీరు చేరింది. పాపికొండలు వెళ్లే పర్యాటక బోట్లు వరదల కారణంగా నిలిపివేశారు.

కాకినాడ మత్స్యకారులకు విముక్తి

52 రోజుల తర్వాత

శ్రీలంక జైలు నుంచి విడుదల

రాజ్యసభ ఎంపీ సానా సతీష్ కృషి


శ్రీలంక జైలు నుంచి విడుదలైన నలుగురు మత్స్యకారులు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక జాఫ్నా జైలులో 52 రోజుల పాటు నిర్బంధంలో ఉన్న కాకినాడకు చెందిన నలుగురు మత్స్యకారులు కె.శ్రీను వెంకటేశ్వర్లు, కర్రి నూకరాజు బుర్రయ్య, చందా నాగేశ్వరరావు, పంతాడి బ్రహ్మానందంలకు విముక్తి లభించింది. రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు గురువారం ఏపీ భవన్ కమిషనర్ డాక్టర్ అర్జా శ్రీకాంత్, శ్రీలంక కోస్ట్‌గార్డ్ కమాండర్ దినేష్ జేతో ప్రత్యేక సమన్వయం జరిపి కోర్టు నుంచి మళ్లీ స్పష్టమైన అనుమతులు వచ్చేలా కృషి చేయడంతో మత్స్యకారులు జైలు నుంచి విడుదలై స్వదేశానికి చేరుకున్నారు. వారిని శుక్రవారం మధ్యాహ్నం విడుదల చేయగా శ్రీలంక నావికా దళం అధికారులు అంతర్జాతీయ సముద్ర సరిహద్దు రేఖ వరకు తీసుకువచ్చి సాయంత్రం రామేశ్వరంలోని మండపం బేస్ సమీపం వద్ద భారత కోస్ట్ గార్డ్ అధికారులకు అధికారికంగా అప్పగించారు. గత ఆగస్టులో మత్స్యకారులు నాగపట్నం వెళ్లి పాత ట్రాలర్ పడవ కొనుగోలు చేసి తిరిగి వస్తుండగా నావిగేషన్ లోపం కారణంగా శ్రీలంక సముద్ర జలాల్లోకి ప్రవేశించారు. దీంతో శ్రీలంక నావికా దళం గత ఆగస్టు 4న వారిని అదుపులోకి తీసుకుని జాఫ్నా జైలులో ఉంచారు. జాఫ్నాలోని కయిట్స్ సివిల్ కోర్టు సెప్టెంబరు 12న వారి విడుదలకు ఆదేశాలు జారీ చేసింది. ట్రాలర్‌ను కూడా తిరిగి ఇవ్వాలని ఆ కోర్టు ఆదేశించినా అనుసంధాన లోపాలు, ప్రక్రియల ఆలస్యం వల్ల మత్స్యకారుల స్వదేశీ రాక ఈనెల 25 వరకు వాయిదా పడింది. మత్స్యకారుల విడుదలైనట్టు ఎంపీ వెల్లడించారు.

వివాహిత అనుమానాస్పద మృతి

పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లి

కేసు నమోదు

రాజానగరం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాతనామవరానికి చెందిన వివాహిత సయ్యద్‌హీరా (22) అనుమానాస్పదస్థితిలో మృతిచెందింది. దీనికి సంబంధించి ఎస్‌ఐ జీవీవీ.సత్యనారాయణ శుక్రవారం విలేకర్లకు తెలిపిన వివరాలు ఈవిధంగా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం అంబేద్కర్ కాలనీకి చెందిన షేక్ వల్లీ తన కుమార్తె సయ్యద్ హీరాను పాతనామవరానికి చెందిన సయ్యద్‌బషీరుద్దీన్‌కు ఇచ్చి సుమారు ఐదేళ్ల క్రితం వివాహం చేసింది. అప్పటి నుంచి వారు పాతనామవరం ఇందిరమ్మకాలనీలో నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇటీవల తమ అల్లుడు, అతడి తల్లి సయ్యద్ హమదున్నీసా, సాహిత్, బషీర్లు, మామగారైన బాజీ వీరందరూ కలసి తమ కుమార్తెను కట్నం కోసం రోజూ తిడుతూ వేధించారని మృతురాలి తల్లి పోలీసుల ఫిర్యాదులో పేర్కొంది. ఆమె ఈనెల 21న కుమార్తెను చూడడానికి నామవరం ఇంటికి వెళ్లగా కుమార్తె తల్లికి తన కష్టాలు చెప్పుకుని బాధపడింది. అయితే సర్దుకుపోవాలని కుమార్తెకు నచ్చచెప్పింది. అయితే తన కుమార్తె గురువారం మరణించిందని చెప్పారని.. తమ అల్లుడు, వారి బంధువులు చంపి ఉంటారని అనుమానంగా ఉందని షేక్ వల్లీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేయగా నార్త్‌జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహాలక్ష్మిదేవిగా..


కాకినాడ జిల్లా కరప మండలం అరట్లకట్టలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని రూ.8లక్షల కరెన్సీతో అలంకరించారు.
- కరప (ఆంధ్రజ్యోతి)


కాకినాడ జిల్లా పిఠాపురం మండలం పి.రాయవరంలో కనకదుర్గమ్మను రూ.4.50 లక్షల కరెన్సీతో మహాలక్ష్మిగా అలంకరించారు.
- పిఠాపురం రూరల్ (ఆంధ్రజ్యోతి)


కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి అన్నపూర్ణాదేవి ఆలయంలో అమ్మవారికి రూ.1,11,116 కరెన్సీతో అలంకరణ
-ఆత్రేయపురం (ఆంధ్రజ్యోతి)


కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో వనదుర్గ, కనకదుర్గ మహాలక్ష్మిగా దర్శనమిచ్చారు.
-అన్నవరం (ఆంధ్రజ్యోతి)

అభివృద్ధిలో క్రీడారంగం కీలకం

రుడా చైర్మన్ బీవీఆర్ చౌదరి.. ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నీ



బరిలో క్రీడాకారిణులు, మ్యాచ్‌లను తిలకిస్తున్న బీవీఆర్ చౌదరి, ఎమ్మెల్యే ఆదిరెడ్డివాసు



రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేశమైనా, రాష్ట్రమైనా పురోభివృద్ధి చెందాలంటే క్రీడారంగం ఎంతో కీలకమైన పాత్ర పోషిస్తుందని రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి అన్నారు. రాజమహేంద్రవరంలోని ఆర్ఎంసీ బ్యాడ్మింటన్ కోర్టులో జరుగుతున్న ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్-2025 పోటీలు శుక్రవారం పోటా పోటీగా సాగాయి. రెండో రోజున జరిగిన ప్రీ క్వార్టర్ ఫైనల్స్ పోటీలను బీవీఆర్ టాస్ వేసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌తో కలసి మ్యాచ్‌లను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడారంగానికి ఎంతో ప్రాధాన్యమిస్తోందన్నారు. క్రీడల అభివృద్ధికి రుడా నుంచి కూడా తమ వంతు సహకారం అందిస్తామన్నారు. క్రీడల నిర్వహణలో రాజమహేంద్రవరం అంతర్జాతీయ స్థాయికి చేరుకోవడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కొత్తపల్లి బాలసుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు ముగ్గురి ఎంపిక



పిఠాపురం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా గోపన్నపాలెం ప్రభుత్వ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో శుక్రవారం ఆదికవి నన్నయ యూనివర్సిటీ స్థాయి ఆర్చరీ పోటీలు జరిగాయి. ఇందులో కాకినాడ జిల్లా పిఠాపురం సీబీఆర్ డిగ్రీ కళాశాల ఫైనలియర్ విద్యార్థి పి.కృష్ణ, సూర్యరాయ డిగ్రీ కళాశాల ఫస్టియర్ విద్యార్థిని కె.హరిణి, జి.మామిడాడ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల పీఈటీ ఫస్టియర్ విద్యార్థి పి.లోకేష్ విజేతలుగా నిలిచారు. ఈ ముగ్గురినీ ఇండియన్ రౌండ్ నన్నయ యూనివర్సిటీ మెన్, ఉమెన్ టీమ్ సభ్యులుగా ఎంపిక చేశారు. వీరు పంజాబ్ రాష్ట్రంలో జరుగబోయే జాతీయ స్థాయి ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంటారు. విజేతలు పిఠాపురానికి చెందిన ఆర్చరీ కోచ్ పి.లక్ష్మణరావు వద్ద శిక్షణ పొందుతున్నారు.

29న నిధి ఆప్‌కే నికత్

పీఎఫ్ ప్రాంతీయ అసిస్టెంట్ కమిషనర్ రాధానాథ్ పట్నాయక్

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలో ఈ నెల 29న 'నిధి ఆప్‌కే నికత్-డిస్ట్రిక్ట్ ఔట్‌రీచ్ ప్రోగ్రాం'ని నిర్వహిస్తున్నామని ప్రాంతీయ అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్ రాధానాథ్ పట్నాయక్ తెలిపారు. ఈపీఎఫ్‌ఐ ఫిర్యాదుల నిర్వహణ వ్యవస్థ, ఇతర ఫిర్యాదుల దాఖలులో నిబంధనలు, క్లెయిమ్‌ల తిరస్కరణకు కారణాలు, స్కీమ్ సర్టిఫికెట్ వల్ల ప్రయోజనాల వంటి వివిధ అంశాలను వివరించడం, ఫిర్యాదుల పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామన్నారు. పీఎఫ్ సభ్యులు, పింఛనుదారులు, ఎస్టాబ్లిష్‌మెంట్లు, కొత్తగా కవర్ కాబడిన వారు తమ ఫిర్యాదులను నిధి ఆప్‌కే నికత్ అని పేర్కొంటూ సమర్పించాలని చెప్పారు. డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ బకాయి ఉన్న పింఛనుదారులు ఈ క్యాంపులో వాటిని అందజేయవచ్చని అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్ పేర్కొన్నారు. ఏలూరు జిల్లా గోపాలపురంలోని శ్రీ సర్వారాయ షుగర్స్ బాట్లింగ్ యూనిట్, పశ్చిమ గోదావరి జిల్లాలో పాలకొల్లు సంధ్య మెరైన్, కాకినాడ జిల్లా తునిలోని శ్రీ ప్రకాశ్ విద్యానికేతన్, కోనసీమ జిల్లా యానాం అడవిపాలెంలో వాసవీ పిగ్మెంట్స్, తూర్పుగోదావరి జిల్లాలో రాజమండ్రి సమీపంలోని వెంకటాపురం జీఎస్ఎల్ ఎడ్యుకేషన్ సొసైటీ, అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో నిధి ఆప్‌కే నిఖత్ ఉదయం 9గంటల నుంచి ప్రారంభం అవుతుందన్నారు.

హౌసింగ్‌బోర్డు కాలనీకి గోదావరి జలాలు

ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

దివాన్‌చెరువు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీకి భవిష్యత్‌లో గోదావరి జలాలతో పూర్తిస్థాయిలో మంచినీటి సరఫరాకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన హౌసింగ్‌బోర్డు కాలనీలో పర్యటించి మంచినీటి సమస్యపై దృష్టిసారించారు. ఈ మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికార్లు, పంచాయితీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. హౌసింగ్ బోర్డుకాలనీలో జడ్జి గారి బంగ్లా నుంచి ప్రధానలైన్‌కి కొత్తగా పైప్‌లైన్ వేసి నారాయణపురం వాటర్‌వర్క్స్ నుంచి హౌసింగ్‌బోర్డుకాలనీకి సరఫరా చేస్తే నీటి సమస్య తీరుతుందన్నారు. అందుకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పాలచర్ల పైప్ లైన్ ద్వారా సరఫరా సమయం పెంచడం ద్వారా నీటి సమస్యకు కొంత ఊరట లభిస్తుందన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో ఉన్న 5 బోర్లు, రాజమహేంద్రవరం కార్పొరేషన్ ఆధ్వర్యంలోని మూడు బోర్లు పనిచేయడం లేదని, వాటికి మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే తక్షణ పరిష్కారంగా రూ.30 లక్షలతో కొత్తగా రెండు బోర్ వెల్స్ మంజూరు చేశారు. వెంటనే వీటి పనులు ప్రారంభించాలని అధికారులకు సూచించారు.

పంచాయతీలు సొంత ఆదాయాలు పెంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుమ

బిక్కవోలు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): పంచాయతీలు ప్రభుత్వ గ్రాంట్లపై ఆధారపడకుండా సొంత ఆదాయాలు పెంచుకుని గ్రామాలను మరింత అభివృద్ధి చేసుకోవాలని ఎంపీపీ తేతలి సుమ పిలుపునిచ్చారు. మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఓన్ సోర్సెస్ రెవెన్యూ(ఓఎస్‌ఆర్)పై రెండు రోజుల పాటు నిర్వహించే శిక్షణా కార్యక్రమాలను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని ఖాళీ స్థలాల్లో కళ్యాణ మండపాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించి వాటిని అద్దెలకు ఇచ్చి ఆదాయం పెంచుకోవచ్చునన్నారు.అలాగే కొబ్బరి, మామిడి వంటి మొక్కల ఫలసాయం,సెల్ టవర్ల ద్వారా ఆదాయం పెంచుకోవాలన్నారు. సోలార్ విద్యుత్ వాడకం ద్వారా విద్యుత్ బిల్లులు తగ్గించుకుని ఆదా చేసుకోవచ్చునన్నారు.గ్రామంలోని ప్రజాప్రతినిధులను ఈ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేసి పంచాయతీలు సొంత ఆదాయాలను సమకూర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.శ్రీనివాస్, డిప్యూటీ ఎంపీడీవో జాన్‌మిల్టన్, ఏవో నాగేంద్ర ప్రసాద్, మాస్టర్ ట్రైనీలు టీవీ కృష్ణారెడ్డి, శ్రీనివాస్, ఏపీవో అగస్టిన్‌కుమార్ పాల్గొన్నారు.

చిలకమర్తి లక్ష్మీనరసింహం జయంతి

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): సంస్కరణల నుంచి జాతీయోద్యమం వరకు తనదైన పాత్ర పోషించి అనేక రచనలతో కళాప్రపూర్ణుడైన చిలకమర్తి లక్ష్మీనరసింహం ధన్యజీవని ఆంధ్ర కేసరి యువజన సమితి పూర్వ అధ్యక్షుడు చిలకమర్తి మనుమడు పెరుమాళ్ల రఘునాథ్ అన్నా రు. చిలకమర్తి జయంతి సందర్భంగా స్వాతంత్ర సమరయోధుల పార్కులో చిలకమర్తి విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి విచ్చేసిన న్యాపతి సుబ్బారావును యువజన సమితి సత్కరించింది. కార్యక్రమంలో దేశిరెడ్డి బలరామనాయుడు పాల్గొన్నారు.

మహాలక్ష్మిదేవిగా దర్శనమిచ్చిన బాలాత్రిపుర సుందరి

» ఐదో రోజు శరన్నవరాత్రి ఉత్సవాలు
» పలుచోట్ల కరెన్సీ నోట్లతో అలంకరణ
» సామూహిక కుంకుమార్చనలు

దివాన్‌చెరువు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా ఐదో రోజైన శుక్రవారం లాలాచెరువు హౌసింగ్ బోర్డుకాలనీలోని శ్రీ బాలాత్రిపుర సుందరిదేవి.. మహాలక్ష్మీ దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా రూ.15 వేలు విలువైన రూ.10, 20,50, 100 కరెన్సీ నోట్లు, చిల్లర నాణెలతో అమ్మవారిని అలంకరించినట్టు ఆలయార్చకుడు పొక్కులూరి రవిశర్మ తెలిపారు. అలాగే అమ్మవారిని 108 బంగారు రూపులు, 1000 పంచలోహ నాణెలతోనూ పూజించామని చెప్పారు. అలాగే స్థానిక శ్రీ లక్ష్మీగణపతి ఆలయం సముదాయంలోని శ్రీకాశీ అన్నపూర్ణాదేవి ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. స్థానిక రాంబాబు డాక్టరు గృహ ఆవరణలోని శ్రీ విశ్వేశ్వరీదేవి ఆలయంలో ప్రముఖులు టీవీ నారాయణరావు ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. కార్యక్రమంలో నన్నయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ సహాయాచార్యులు తలారి వాసు, కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ రాంబాబు, సుబ్బలక్ష్మి, ముక్కవిల్లి వాసు తదితరులు పాల్గొన్నారు.



విజయవాడ దుర్గమ్మ ఆలయంలో ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి: అనపర్తిలోని ఓంశక్తి సత్సంగం, త్రిశక్తి పీఠంలోని అమ్మవార్లకు, శాంతిపురంలోని మహాలక్ష్మి ఆలయంలోని అమ్మవారికి మహాలక్ష్మి దేవిగా అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని కుంకుమ పూజలు నిర్వహించారు. ఇదిలా ఉండగా విజయవాడలోని ఇంద్రకీలాద్రిలో అమ్మవారిని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు ఎమ్మెల్యేకు ఆశీర్వచనాలు అందజేసి ప్రసాదం అందజేశారు.





రాజానగరం మండలం లాలాచెరువు హౌసింగ్‌బోర్డు కాలనీలోను, కడియం మండలం కడియపులంకలోను కరెన్సీ నోట్లతో అమ్మవారికి అలంకరణ

గోకవరం: గోకవరంలోని వీరభద్రుని గద్దెలో కనకదుర్గమ్మ శ్రీమహాలక్ష్మి దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు.ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో అమ్మవారిని గాజులతో అలంకరించారు. అమ్మవారి వద్ద కొత్త నోట్లు ఉంచి ఆలయార్చకులు కృష్ణశర్మ ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అలాగే రంపయర్రంపాలెంలో 300 మంది ఆడపడుచులు బతుకమ్మ డ్యాన్సులతో అలరించారు. 9 అమ్మవారి రూపాలతో ఊరేగింపు చేపట్టారు.

కడియం: కడియం దుర్గాదేవి,కడియపులంక అనంతేశ్వరస్వామి ఆలయంలో అపర్ణాదేవి, వేమగిరి దుర్గాదేవి, వీరవరం కనకదుర్గాదేవి, దుళ్ల దుర్గాదేవి, జేగురుపాడు కనకదుర్గాదేవి ఆలయాల్లో మహిళలు కుంకుమార్చన పూజలు చేశారు. ఆయా ఆలయాల్లో అమ్మవారిని లక్ష్మీదేవిగా అలంకరించారు. మురమండ మాచరమ్మతల్లి ఆలయంలో కుంకుమార్చన, పూజలు చేశారు. 58 రకాల నైవేద్యాలు సమర్పించారు. మంగళవాయిద్యాలు, భాజాభజంత్రీల నడుమ అమ్మ వారికి ఘనంగా గ్రామోత్సవం జరిపారు.



గాజుల అలంకరణలో అమ్మవారు

సామూహిక కుంకుమ పూజలు

బిక్కవోలు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం గ్రామంలోని కరణం గారి మేడలో వున్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవార్కి మహిళలు సామూహిక కుంకుమ పూజలు జరిపారు. జువ్వలదొడ్డిలోని శ్రీరాజరాజేశ్వరి పీఠంలో అమ్మవారు బాలాత్రిపురసుందరి అవతారంలో దర్శనమిచ్చారు. ఈ అవతారంలో అమ్మవార్ని పూజించడం వల్ల కన్యలకు వివాహం, వివాహితలకు మాంగల్య బలం, సర్వ సౌభాగ్యాలు కలుగుతాయని పీఠాధిపతి దేవర భోట్ల ప్రభాకరశర్మ తెలిపారు.

కోరుకొండ: కాపవరం జంక్షన్ వద్ద రాజరాజేశ్వరి ఆలయంలో సామూహిక సహస్ర కుంకుమార్చనలు జరిగాయి. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నీరుకొండ వీరన్నచౌదరి కోరుకొండలో దుర్గమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అనువంశిక ధర్మకర్త నీరుకొండ వర్ధన విజయభాస్కరరావు, ఆలయ కమిటీ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆర్ట్స్‌లో జిల్లా టెన్నిస్ టోర్నమెంట్

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల అల్యూమ్ని అసోసియేషన్ ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో టెన్నిస్ క్లబ్‌లో నిర్వహిస్తున్న డిస్ట్రిక్ టెన్నిస్ టోర్నమెంట్-2025ను ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర(ఆర్‌కే)ఆయన శుక్రవారం ప్రారంభించారు. అండర్-10నుంచి 16 వరకు వయస్సు కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఈ టెన్నిస్ టోర్నమెంట్‌ను ఏర్పాటు చేసిన అల్యూమ్ని అసోసియేషన్‌ను అభినందించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ముళ్ల మాధవ్ మాట్లాడుతూ విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ఈ క్రీడలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో శ్యామ్ సింగ్, అల్యూమ్ని అసోసియేషన్ జనరల్ సెక్రటరీ గద్దె సుధాకర్, కోచ్ ప్రకాష్ పాల్గొన్నారు.



రాజమహేంద్రవరం చింతాలమ్మ ఘాట్‌లోని అమ్మవారికి జనసేన పార్టీ సిటీ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ మొక్కు తీర్చుకున్నారు. సిటీ సంయుక్త కార్యదర్శి కురం అప్పారావు ఆధ్వర్యంలో 108 బిందెలతో ఊరేగింపుగా వెళ్లి అభిషేకం చేశారు.
-రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి)

దేవాలయాల అభివృద్ధికి కృషి

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): దేవాలయాల అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి కోరింది. స్థానిక సరస్వతీ ఘాట్‌లో శుక్రవారం జిల్లా సమితి, అనుబంధ దుర్గా శక్తి మహిళా విభాగం ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం అధ్యక్షుడు రవికుమార్ ఆధ్వర్యంలో జరిగింది. జిల్లా నూతన గౌరవాధ్యక్షుడిగా ఇంద్రగంటి గోపాలకృష్ణ శర్మ, అధ్యక్షుడిగా వెలుగూరి రవికుమార్, కార్యదర్శిగా పోతుల వెంకటేశ్వరరావు, మరో 30 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. దేవాలయాలకు ఎక్కడ సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని సమన్వయంతో పరిష్కరించడానికి కృషి చేస్తామని రవికుమార్ అన్నారు.

11న స.హ.చ వార్షిక సభ

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 26(ఆం ధ్రజ్యోతి): వచ్చేనెల 11న సమాచార హక్కుచట్టం వార్షిక సభను నిర్వహిస్తున్నామని గార్డ్స్ ఫర్ ఆర్‌టీఐ కన్వీనర్ వరదా నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం రాజమహేంద్రవరంలో జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాచార హక్కుచట్టం వచ్చి 20 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జరిపే సభ ను విజయవతం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రధాని మోదీ ఫొటో ఎగ్జిబిషన్

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జయంతి సందర్భంగా జరుగుతున్న సేవా పక్షోత్సవాల్లో భాగంగా రాజమహేంద్రవరంలోని జిల్లా బీజేపీ కార్యాలయంలో ప్రధాని జీవిత విశేషాలపై ఫొటో ఎగ్జిబిషన్, డాక్యుమెంటరీ ఏర్పాటు చేశారు. జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ అధికార ప్రతినిధి ముళ్లపూడి రేణుక మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు, వాటి ప్రయోజనాలు వివరించారు.

122 మందికి వైద్య పరీక్షలు

బిక్కవోలు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా శుక్రవారం ఇళ్ల పల్లిలో నిర్వహించిన వైద్యశిబిరంలో 122 మందికి వైద్య పరీక్షలు జరిపి మందులు అందజేసినట్టు బిక్కవోలు పీహెచ్‌సీ వైద్యాధికారి దుర్గాదేవి తెలిపారు.మహిళల ఆరోగ్యం, బాలికా సంరక్షణ, రక్తహీనతకు నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. తనుకు శ్రీధర్, డాక్టర్ రుమన్, డీపీఎంవో నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రంగంపేట: మండలంలోని ముకుందవరంలో నిర్వహించిన వైద్యశిబిరంలో 259 మందికి, సింగంపల్లిలో 212 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. రంగంపేట, సింగంపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు బి.వేణుశ్రీలక్ష్మీ, కె.సంకీర్తనల ఆధ్వర్యంలో జరిగిన ఆయా కార్యక్రమాల్లో యడ్ల గణేష్, వట్టికూటి వెంకన్నబాబు,ముంగి మురళి, కొమ్మన రాంబాబు,యానాల కొండయ్య పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తవ్వాలి: పీడీ

కడియం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): పేదలకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ నాతి బుజ్జి అధికారులకు ఆదేశించారు. మురమండలో గృహనిర్మాణ లబ్ధిదారులకు అందించే సిమెంట్, ఇనుము భద్రపరిచిన గొడౌన్‌ను శుక్రవారం ఆమె పరిశీలించారు. మండలంలో 2705 మంది లబ్ధిదారులు ఉండగా 1140 ఇళ్లు పూర్తయినట్టు తెలిపారు. మిగిలిన వారు కూడా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఇన్‌చార్జి డీఈఈ శ్రీకాంత్, ఏఈ ఎన్ సూర్యప్రకాష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శివకృష్ణ తదితరులున్నారు.

జీఎస్‌టీ సంస్కరణలతో ప్రజలకు మేలు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): జీఎస్‌టీ సంస్కరణలతో ప్రజలకు మేలు జరుగుతుందని కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె జేసీ వై.మేఘస్వరూప్‌తో కలిసి పాల్గొన్నారు.అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ నిత్యావసర సరు కులు, గృహోపకరణాలు, ఔషధాలు, విద్య, స్టేషనరీ, వస్త్రాలు, క్రీడా వస్తువులు, రవాణా, హోటల్ తదితర రంగాల్లో ఈనెల 22నుంచి పన్నుల తగ్గింపు అమల్లోకి వచ్చిందన్నారు.వాటి వల్ల కలిగే మేలును వివరించడానికి,సూపర్ జీఎస్‌టీ-సూపర్ సేవింగ్స్ పేరుతో జిల్లాలో దీపావళి వరకూ ప్రచారం చేస్తామన్నారు.

కోరుకొండలో మహాజన సభ

కోరుకొండ, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని 10 గ్రామాలకు సంబంధించిన కోరుకొండ వ్యవసాయ సొసైటీ 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.57. 25 లక్షలు లాభాలను కలిగి ఉందని, జిల్లాలో ప్రథమ స్థానంలో ఉంటూ కేంద్ర ప్రభుత్వ ఎఫ్‌పీవో గుర్తింపునకు ఎంపికైందని చైర్మన్ బత్తుల గోపాలకృష్ణ పేర్కొన్నారు.శుక్రవారం సాయంత్రం ఆయన అధ్యక్షతన జరిగిన సొసైటీ రైతు మహాజన సభలో సీఈవో ఆకుల వెంకటరమణ సొసైటీ కార్యకలాపాలను, జమా ఖర్చులను వివరించారు.2800 మంది సభ్యులుగా ఉన్న కోరుకొండ సొసైటీలో 1100 మంది రైతులు రుణాలు తీసుకున్నారన్నారు.రైతునేస్తం ద్వారా 30మంది రైతులకు రూ.1 కోటి రుణాలు ఇచ్చామన్నారు. ఈ ఖరీఫ్‌లో రైతుల 200 మెట్రిక్ టన్నుల యూరియా, 25 టన్నుల విత్తనాలను అందించామన్నారు.అర్హులైన రైతులకు ఎకరాకు రూ.8లక్షల రుణాలు అందించామన్నారు. సొసైటీ సొంత నిధుల నుంచి ఎకరానికి రూ.2.50 లక్షల వరకు రుణాలు అందిస్తున్నామన్నారు.సమావేశంలో సభ్యుడు సుంకర శ్రీను తదితరులు పాల్గొన్నారు.



గోకవరం మండలం రంపయర్రం పాలెంలో శుక్రవారం బతుకమ్మ పండుగను ఇలా జరుపుకున్నారు..బతుకమ్మ పండుగ తెలంగాణలో ఫేమస్.. దసరా ఉత్సవాల్లో ఘనంగా చేస్తారు.. ఆ సంస్కృతి మన జిల్లాలోనూ కనిపిస్తోంది.. - గోకవరం





తల్లీ..కోటసత్తెమ్మ

కోటసత్తెమ్మ ఆలయంలో శుక్రవారం ఐదో రోజు దేవీ నవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరిగాయి.అమ్మవారికి నిత్యాభిషేకం, ప్రత్యేక సహస్రనామ కుంకుమ పూజలు, చండీ పారాయణం, సాయంత్రం హోమం నిర్వహించారు. శుక్రవారం 525 మంది దంపతులు ప్రత్యేక కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. - నిడదవోలు



రూ.16 లక్షలతో అలంకరణ

నల్లజర్ల మండలం పోతవరం చావా రామకృష్ణ రోడ్డులో విజయ కనకదుర్గ అమ్మవారి 16వ దసరా మహోత్సవం సందర్భంగా శుక్రవారం రూ.16 లక్షల కరెన్సీ నోట్లతో మహాలక్ష్మిగా అలంకరించారు.అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. - నల్లజర్ల



మంత్రి అచ్చెన్నాయుడికి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు వినతి

నా తర్వాత సీనియర్ మోస్ట్ ఎమ్మెల్యే బుచ్చయ్యచౌదరి

అసెంబ్లీలో సీఎం చంద్రబాబు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నేను రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరిని అభినందిస్తున్నా. సభలో నా తర్వాత సీనియర్ మోస్ట్ ఎమ్మెల్యే. ఆయన స్ఫూర్తి కూడా. మొదటి నుంచి చూస్తున్నా.ఏదైనా చెబితే మొత్తం సబ్జెక్ట్ నేర్చుకుని మాట్లాడతారని సీఎం చంద్రబాబు శుక్రవారం అసెంబ్లీలో ప్రకటించారు. ఎమ్మెల్యే,టీడీపీ సీనియర్ నేత గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ చంద్రబాబునుద్దేశించి మిమ్మల్ని చూస్తుంటే అప్పుడే నేను ఎందుకుపుట్టాను.. మరో 40 ఏళ్ల తర్వాత పుట్టి ఉంటే బాగుండును. ఎందుకంటే మీరు తెచ్చిన డిజిటల్, ఇతర టెక్నాలజీలు నేర్చుకోవడానికి చచ్చిపోతున్నాం..అమెరికాలో ఉన్న మనవళ్లకు ఫోన్ చేసి వాళ్ల ద్వారా నేర్చుకుంటున్నా. రాష్ట్ర ప్రగతికి అవసరమైన సంస్కరణలు మీరే తెచ్చారు. ఆంధ్ర,తెలంగాణ బిడ్డలంతా ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి మీ నిర్ణయాలే కారణమని చెప్పారు. రాక్షసులు తిరిగి వస్తారనే ఆలోచన ఉండకూడదు. 20 నుంచి 30 ఏళ్లు సెంట్రల్ జైలే వారికి గతి అనేది తెలియాలన్నారు.

ఈనాం భూముల రైతుల ఇబ్బందులు తొలగించాలి

ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు,సెప్టెంబరు 26 (ఆంధ్ర జ్యోతి): కొవ్వూరు మండలం ఆరికిరేవుల, నందమూరు, పశివేదల, వేములూరు గ్రామాల్లో రైతులు ఈనాం భూములకు సంబంధించి ఇబ్బందులను తొలగించాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కోరారు. అసెంబ్లీలో శుక్రవారం మాట్లాడారు.ఈనాం భూములకు గతంలో మాదిరిగా అడంగల్, 1బీలు ఇచ్చి లావాదేవీలు జరిగేటట్లు చూడాలన్నారు. గడచిన ప్రభుత్వం నాడు-నేడు పథకం కింద రూ.కోట్లాది రూపాయలతో పాఠశాల భవన నిర్మాణాలు చేపట్టి అసంపూర్తిగా వదిలేశారన్నారు. నాడు నేడు నిధుల వినియోగంపై దర్యాప్తు చేపట్టాలని కోరారు.అనంతరం వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి అచ్చెన్నాయుడిని కలిసి తాళ్లపూడి మండలం పెద్దేవంలో ఫైలేరియాసిస్ వ్యాధితో గేదెలు మృతిచెందిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వినతిపత్రం అందజేశారు.



ఇసుక రవాణాపై సమీక్షిస్తున్న ఆర్డీవో

ఇసుక అక్రమ రవాణాపై 24 గంటలు నిఘా

కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత

కొవ్వూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు 24 గంటలు పనిచేసేలా టాస్క్‌ఫోర్స్ బృందాలు ఏర్పాటు చేస్తున్నట్టు కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం డివిజన్ స్థాయిలో ఇసుక స్టాక్ పాయింట్, బోట్స్‌మేన్ సొసైటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద రోడ్డుపై ఐదు లారీలకు మించి ఉండకూడదన్నారు.ఇసుక లారీపై టార్పలిన్ కప్పకపోతే లారీ యజమానులతో పాటు ఇసుకర్యాంపుల వారికి జరిమానాలు విధిస్తామన్నారు. రోడ్లపై పడిన ఇసుకను ఎప్పటికప్పుడు ర్యాంపు నిర్వాహకులు శుభ్రం చేయించాలన్నారు. బల్క్ బుకింగ్‌ల వివరాలు తప్పనిసరిగా ఆర్డీవో కార్యాలయానికి అందజేయాలన్నారు.ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు 24 గంటలు టాస్క్‌ఫోర్సు బృందాలు పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.మైన్స్ ఏడీ ఫణిభూషణ్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా నుంచి తెలంగాణకు భారీగా ఇసుక తరలింపుపై విచారణ కొనసాగుతుందన్నారు.చింతలపూడి ప్రాంతానికి ఏకంగా 1.28 లక్షల టన్నులు ఇసుక తరలించినట్టు తెలిపారు. ఒకే ఆధార్‌కార్డుతో 20 నుంచి 30 వేల టన్నుల ఇసుక బుకింగ్ చేసుకుంటున్నారన్నారు. బల్క్ బుకింగ్ పేరుతో ఇసుక అక్రమంగా తరలిపోతుందన్నారు. ఓవర్ లోడింగ్‌పై చర్యలు తప్పవన్నారు.





అభివృద్ధికి.. జల..బాట!

అసెంబ్లీలో జలరవాణాపై చంద్రబాబు కీలక ప్రసంగం

జల రవాణాపై ఇదీ లెక్క..

ఉమ్మడి జిల్లాలో కాకినాడ నుంచి ఏలూరు కాలువ వరకు ఇన్‌లాండ్ వాటర్ కింద నదీ మార్గాల్లో కార్గో తరలింపుపైనా ప్రణాళికలు సిద్ధం చేసినట్టు వివరించారు. గోదావరి నది ద్వారా కృష్ణాకు, కాకినాడ-ఏలూరు కాలువ, కాకినాడ-బకింగ్‌హాం కెనాల్ నుంచి చెన్నైకు, గోదావరి ద్వారా మహారాష్ట్రకు జల రవాణాకు ఎంతో ఆస్కారం ఉందని వివరించారు. నదులపై కాలువ మార్గాల ద్వారా అనేక పరిశ్రమలకు కార్గో ఏవిధంగా తరలించవచ్చనే దానిపై ఇప్పటికే టెండర్లు పిలిచామని చెప్పారు. ఈ మార్గాలను అభివృద్ధి చేయడానికి కొందరు ముందుకు వస్తున్నారన్నారు. రవాణా రంగం ఖర్చుల విషయానికి వస్తే టన్ను కార్గో రవాణా ఖర్చుకు రోడ్డు మార్గం ద్వారా రూ.3.78 అవుతుంటే.. సముద్రమార్గం రవాణాకు రూ.1.80, నదీ జలరవాణాకు రూ.3.30 అవుతుందన్నారు.



(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

ఓడరేవులు, నదీ జల రవాణాతో పారిశ్రామికంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు అద్భుత భవిష్యత్తు లభించబోతోందని సీఎం చంద్రబాబు అన్నారు. అత్యంత చవకైన కార్గో రవాణా ద్వారా పారిశ్రామిక అభివృద్ధి పెద్ద ఎత్తున జరగనుందని వివరించారు. ఈ మేరకు అసెంబ్లీలో సీఎం శుక్రవారం పారిశ్రామిక, ఓడరేవు, లాజిస్టిక్ రంగాల్లో కొనసాగుతున్న పెట్టుబడులు, భవిష్యత్ ప్రాజెక్టులను కూలంకషంగా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా విశ్లేషించారు. తీరప్రాంతాన్ని గుజరాత్ తర్వాత దేశంలో ఆంధ్రప్రదేశ్ సమర్థవంతంగా వినియోగించుకుంటోందన్నారు.

సీఎం ఏమన్నారంటే..

కాకినాడ గేట్‌వే పోర్టు(కేజీపీఎల్) రూ.2,621 కోట్లతో చేపట్టిన కొత్త పోర్టు నిర్మాణం వచ్చే ఏడాది డిసెంబరు నాటికి పూర్తవుతుందన్నారు. ఈ కొత్త పోర్టు అందుబాటులోకి వస్తే ఏటా 16 మిలియన్ మెట్రిక్ టన్నుల కార్గో హ్యాండ్లింగ్ జరుగుతుందన్నారు. ప్రస్తుతం పోర్టులో మూడు బెర్తుల నిర్మాణం జరుగుతోంది. ఒకటి బొగ్గు దిగుమతికి, మరో రెండు బెర్తులు అన్ని రకాల కార్గో ఎగుమతి,దిగుమతులకు వినియోగిస్తున్నారన్నారు. వచ్చే ఏడాది డిసెంబరుకు ఇది అందుబాటులోకి వస్తే మౌలిక వసతులు, పారిశ్రామికంగా ఆ ప్రాంతం అభివృద్ధి జరుగుతుందని సీఎం వివరించారు. ఇదికాకుండా ప్రస్తుతం కార్యకలాపాలు నిర్వహిస్తున్న కాకినాడ సీపోర్టు ద్వారా ఏటా 26 మిలియన్ మెట్రిక్ టన్నులు, కాకినాడ యాంకరేజ్ పోర్టు ద్వారా 4 మిలియన్ మెట్రిక్ టన్నులు, కోనసీమలోని రవ్వ పోర్టు ద్వారా 2 మిలియన్ మెట్రిక్ టన్నుల ముడిచమురు కార్గో కార్యకలాపాల ద్వారా జరుగుతున్నాయన్నారు. భవిష్యత్తులో ఈ పోర్టుల ద్వారా వ్యాపారం పెరుగుతుందన్నారు.

ప్రతిపాదనలు సిద్ధం..

ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో గోదావరి కాలువలపై సరుకు రవాణా, పర్యాటక యాత్రలకు పది రూట్లను ఏపీ ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ ఎంపిక చేసి ప్రతిపాదనలు సిద్ధం చేసింది. నేషనల్ వాటర్‌వే-4 ద్వారా కాకినాడ కెనాల్, గోదావరి మీదుగా సిమెంట్ ఫ్యాక్టరీలు, పవర్ ప్లాంట్లకు ముడిసరుకు సరఫరాకు ప్రణాళికలు తయారు చేసింది. ఈ మేరకు కాకినాడ- రాజమహేంద్రవరం, రాజమహేంద్రవరం- విజయవాడ కెనాల్, రాజమహేంద్రవరం- భద్రాచలం, పురుషోత్తపట్నం-భద్రాచలం గోదావరి మార్గం, పురుషోత్తపట్నం-పోలవరం,నర్సాపూర్ వెస్ట్- అంతర్వేది- సఖినేటిపల్లి, కోటిపల్లి-ముక్తేశ్వరం మార్గాలను ఎంపిక చేసింది. విమానయాన రంగాన్ని ప్రోత్సహించడంలో భాగంగా రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టు రన్‌వే విస్తరణ కూడా చేపట్టామని సీఎం వివరించారు.

ఓఎన్జీసీ, గెయిల్‌పై వాడివేడిగా..

ఉమ్మడి జిల్లాలో చమురు, గ్యాస్ కార్యకలాపాలు నిర్వహిస్తోన్న ఓఎన్జీసీ, గెయిల్ సంస్థల తీరుపై అసెంబ్లీలో కోనసీమ జిల్లా ఎమ్మెల్యేలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఓఎన్జీసీ, గెయిల్ గ్యాస్, చమురు పైపులైన్ల కారణంగా గోదావరి తీర ప్రాంతం దెబ్బతిందని, ప్రధానంగా కోనసీమ జిల్లాలో భూగర్భ జలాలు పాడైపోయాయని రాజోలు ఎమ్మెల్యే వరప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రెండు కంపెనీలు కనీసం సీఎస్సార్ అమలులోను బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నాయన్నారు. ఈ సంస్థల వల్ల అనేక చోట్ల భూమి కుంగిపోయి డ్రైనేజీ సమస్యలు వస్తున్నాయని వివరించారు. దీనిపై శాస్త్రీయ అధ్యయనం జరగాలని డిమాండ్ చేశారు. పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి మాట్లాడుతూ ఈ రెండు సంస్థలు ఏర్పాటయ్యే సమయంలో స్థానికులకు ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఆ తర్వాత మోసగించాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీరిద్దరి ప్రశ్నలకు మంత్రి బీసీ జనార్దనరెడ్డి అసెంబ్లీలో సమాధానం ఇచ్చారు. ఎమ్మెల్యేలు లేవనెత్తిన సమస్యలపై త్వరలో అధికారుల ద్వారా నివేదిక రప్పిస్తామని, తదనుగుణంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. భూమి కుంగిపోవడం, సముద్రంలోకి వెళ్లకుండా మురుగునీటి డ్రైన్లు పొంగుతున్నాయన్న సమస్యపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సీఎస్సార్ నిధులు ఖర్చు చేయడం లేదనే విషయంపై నివేదికలు రప్పిస్తామని తెలిపారు.

- ఓడరేవు, లాజిస్టిక్ అభివృద్ధి
- రూ.2,621 కోట్లతో గేట్‌వే పోర్టు
- వచ్చే ఏడాది డిసెంబర్‌కు పూర్తి
- జలరవాణాకు కసరత్తు
- విమానాశ్రయ రన్‌వే విస్తరణ
- ఓఎన్జీసీ, గెయిల్ విధ్వంసంపై చర్చ
- ఉమ్మడి జిల్లాకు అద్భుత భవిష్యత్తు



రాజమండ్రిలో ట్రాఫిక్ అస్తవ్యస్తం

ఎటెళ్లాలి!

నగరంలో తప్పని ట్రాఫిక్ ఇక్కట్లు

- నగరంలో బయటకెళితే చింతే
- ఎక్కడా పనిచేయని సిగ్నల్స్
- జంక్షన్లలో తప్పని టెన్షన్
- పెరుగుతున్న ప్రమాదాలు
- భయపడుతున్న వాహనదారులు
- మరో వైపు ట్రాఫిక్ పోలీసుల కొరత

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ట్రాఫిక్ తలపోటుగా మారింది. శాఖల సమన్వయ లోపం, ట్రాఫిక్ పోలీసుల కొరతతో జిల్లా కేంద్రంలో నియంత్రణ కోల్పోయింది. రాజమహేంద్రవరంలో మరీ అస్తవ్యస్తంగా మారింది. ట్రాఫిక్ నియంత్రణలో ప్రధాన భూమిక పోషించే జంక్షన్లలో సిగ్నల్స్ వెలిగితే సంబరమే. నగరాలు/పట్టణాల్లో దారితప్పిన ట్రాఫిక్ వాహనదారులను విసుగెత్తిస్తోంది. ట్రాఫిక్ చిక్కుల నుంచి రాజమహేంద్రవరాన్ని బయటపడేయడం ఓ పెద్ద చిక్కుముడిగా మారింది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపించాల్సిన అవసరత అత్యవసరంగా కనిపిస్తోంది.

సమన్వయ లోపం

నగరంలో పది కూడళ్లలో విద్యుత్, మరో పది జంక్షన్లలో సోలార్ సిస్టంతో సిగ్నల్స్ పనిచేస్తాయి. వీటి నిర్వహణ బాధ్యత మునిసిపల్ కార్పొరేషన్‌లోని పట్టణ ప్రణాళికా విభాగం చూసుకుంటుంది. కాంట్రాక్టర్లతో అగ్రిమెంట్లు చేసుకోవడం వరకూ బాగానే ఉన్నా.. నిర్వహణలో అజమాయిషీ అంతంత మాత్రంగా ఉండడంపై విమర్శలు వినవస్తున్నాయి. పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టంలు పడకునే ఉంటున్నాయి.

సిగ్నల్స్ వెలిగితే అదృష్టమే..

జిల్లాలోని అధికశాతం కూడళ్లు, ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాల్లో అసలు ట్రాఫిక్ సిగ్నల్సే లేవు. కొవ్వూరు, నిడదవోలు పట్టణాల్లోనూ అదే పరిస్థితి.ఒకవేళ ఉన్నా నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంటోంది. సాక్షాత్తూ కలెక్టర్, ఎస్పీ, మునిసిపల్ కమిషనర్, విద్యుత్ ఎస్ఈ రోజూ తిరిగే జిల్లా కేంద్రంలో కూడా సిగ్నల్స్ వాటి ఇష్టానుసారంగా పనిచేస్తాయి. ప్రజాప్రతినిధులు ఇదే రోడ్లపై సంచరిస్తున్నా వారికి ఈ సమస్య కనబడడం లేదు. రాజమహేంద్రవరంలోని ముఖ్య కూడళ్లయిన కంబాలచెరువు,ఐటీ ఆఫీస్, లాలాచెరువు, డీటీసీ జంక్షన్, శ్యామలా సెంటర్, వీఎల్ పురం జంక్షన్, జాంపేట, దేవీచౌక్, గోకవరం బస్టాండ్, కోటిపల్లి బస్టాండ్, తాడితోట, వీఎల్‌పురం వద్ద సిగ్నల్స్ ఉన్నా ఎక్కువ సమయం నిద్దరోతూనే ఉంటాయి. ఉదాహరణకు డీటీసీ జంక్షను బ్లాక్ స్పాట్ లిస్టులో ఉంది.కానీ ఇక్కడ కనీసం లైటింగ్ ఉండదు. సిగ్నల్ దోబూచులాట మామూలే.

అభివృద్ధి పేరుతో..

జిల్లా కేంద్రమైన తర్వాత రాజమహేంద్రవరంలో గతం కంటే ట్రాఫిక్ పెరిగింది.. ఎక్కడైనా ట్రాఫిక్ పెరిగితే ఇబ్బందులు అధిగమించడానికి రోడ్లు, కూడళ్లు వెడల్పు చేస్తారు. కానీ వైసీపీ ప్రభుత్వంలో జిల్లాలో అభివృద్ధి పేరుతో రోడ్లు, జంక్షన్లు కుచించుకుపోయేలా చేశారు. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు పెరిగిపోయాయి. వాటికి అస్తవ్యస్త సిగ్నల్స్ నిర్వహణ ఆజ్యం పోస్తోంది. ఉదాహరణకు రాజమహేంద్రవరంలో కంబాలచెరువు, ఐటీ ఆఫీస్ ఏరియాల్లో జంక్షన్ల అభివృద్ధి పేరుతో చేసిన పనుల వల్ల వాహనదారులకు ఇబ్బందులెక్కువయ్యాయి. సాధారణంగా ట్రాఫిక్ నియంత్రణకు ట్రాఫిక్ సలహా కమిటీ ఉంటుంది. దీనిలో మునిసిపాలిటీ, పోలీస్, ఆర్అండ్‌బీ, రెవెన్యూ, విద్యుత్, నేషనల్ హైవేస్ తదితర శాఖలతో పాటు వ్యాపారులు ఉంటారు. ట్రాఫిక్ సమస్యలపై శాశ్వతమైన నిర్ణయాలను కమిటీ తీసుకుంటుంది. ఆ మేరకు చర్యలు చేపట్టి ట్రాఫిక్ ఇబ్బందులను అధిగమిస్తారు. అయితే,అసలు ట్రాఫిక్ సలహా కమిటీలు ఉన్నాయా? అంటే సమాధానం ముఖం చాటేస్తోంది.

ట్రాఫిక్ పోలీసుల కొరత..

రాజమహేంద్రవరం నిత్యం రద్దీగానే ఉంటుంది. రోజుకు లక్షల వాహనాలు సంచరిస్తూ ఉంటాయి.కానీ ట్రాఫిక్‌ని నియంత్రించే పోలీసుల కొరత తీవ్రంగా ఉంది. ట్రాఫిక్ విభాగానికి డీఎస్పీ, ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్ఐలు, ఒక సార్జెంట్ ఉండాలి.కానీ చాలా సీట్లు ఖాళీగా ఉన్నాయి. కిందిస్థాయి సిబ్బంది 25 మంది కావాల్సి ఉంది. సెంట్రల్ జోన్ డీఎస్పీకి చాలా కాలంగా ట్రాఫిక్ బాధ్యతలు అప్పగించారు. ఆయన ఇటీవల ఉద్యోగ విరమణ పొందారు. ఆ పోస్టును భర్తీ చేయలేదు. ఇద్దరు సీఐలకు ఒకరు అవినీతి ఆరోపణలపై ఇంటికెళ్లారు.అప్పటి నుంచీ ఒక సీఐ మాత్రమే చక్కబెడుతున్నారు. ఐదుగురు ఎస్ఐలు చేయాల్సిన పనులను ముగ్గురు మోస్తున్నారు. ట్రాఫిక్ నియంత్రణలో క్షేత్రస్థాయిలో కీలక భూమిక పోషించే హోంగార్డులు, కానిస్టేబుల్స్ కొరత ఉంది.

కొత్త బైక్‌లు వచ్చాయ్!

జిల్లా పోలీసులకు విధుల్లో అవసరత నిమిత్తం 42 కొత్త ద్విచక్ర వాహనాలను ప్రభుత్వం కేటాయించింది. వీటిని ఎస్పీ నరసింహ కిశోర్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం టెస్ట్ డ్రైవ్ చేశారు.కొత్త వాహనాలను శాంతి భద్రతలు, స్పెషల్ బ్రాంచ్, ట్రాఫిక్ పోలీసులకు ఇచ్చామన్నారు. కొత్తగా 19 పల్సర్, 20 అపాచీ, 2 రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌లు, ఒక ప్లెజర్ స్కూటర్ వచ్చాయన్నారు. - (రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)



రాజానగరం, అనపర్తి ఏఎంసీలకు కమిటీలు

అనపర్తి చైర్మన్‌గా సూర్యకుమారి



అనపర్తి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : అనపర్తి ఏఎంసీ చైర్‌పర్సన్‌గా పెదపూడి మండలం గొల్లలమామిడాడకు చెందిన జుత్తుక సూర్యకుమారి నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది.గౌరవ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, వైస్ చైర్మన్‌గా కోనాల వెంకటరెడ్డి, డైరెక్టర్లుగా యామల చిన్నమ్మ, సిరపల్లి లక్ష్మి, ఒంటిమి గౌతమి, పెండెం అప్పన్న, గంగుమళ్ళ వెంకట తలుపులమ్మ దేవి, తేతలి సూర్యనారాయణరెడ్డి, నడింపల్లి సూర్యకుమారి, తేనెల కృష్ణవేణి, బోగాడి వెంకటరమణ, ఎన్ఆర్‌కె.ప్రసాదరెడ్డి, మద్దిపూడి సత్యనారాయణ, పంచికట్ల నాగరాజు, ఇందల వీరబాబు, అనపర్తి సర్పంచ్ వారా కుమారి, పలువురు అధికారులను నియమించింది. చైర్ పర్సన్‌గా నియమితులైన సూర్యకుమారి పెదపూడి ఎంపీపీగా పనిచేశారు.ప్రస్తుతం అనపర్తి నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలిగా ఉన్నారు.ఆమె భర్త కృష్ణ పెదపూడి మండల టీడీపీ అధ్యక్షుడిగా ఉన్నారు.పదవికి వన్నె తెచ్చేందుకు కృషి చేస్తానన్నారు.

రాజానగరం చైర్మన్‌గా తనకాల

దివాన్‌చెరువు, సెప్టెంబరు26 (ఆంధ్రజ్యోతి) : రాజానగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కోరుకొండ మండలానికి చెందిన తనకాల వెంకటరమణమ్మ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. గౌరవ చైర్మన్‌గా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణను నియమించింది. సభ్యులుగా ముక్కాదేవి దుర్గ, బల్లేని కనకమహాలక్ష్మి, పెనుగొండ శ్రావణలక్ష్మి, మద్దాల అచ్చమ్మ, పెమ్మనబోయిన వెంకటేష్, కలుం భాగ్యలక్ష్మి, గొంతిన సూరిబాబు, సైతిని లక్ష్మి, వాకపల్లి అప్పలరాజు, బొర్రా వీరబాబు, యర్రంశెట్టి పోలారావు, దండమూడి రవికుమార్, యడవిల్లి సూర్యచక్రం, యర్రంశెట్టి శ్రీనును నియమించారు. దివాన్‌చెరువు పీఏసీఎస్ అధ్యక్షుడు, వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్, తూర్పుగోనగూడెం సర్పంచ్, జిల్లా వ్యవసాయ ట్రేడ్ మార్కెటింగ్ అధికారిని సభ్యులుగా నియమించినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



కొత్త బైక్‌లతో పోలీసులు ర్యాలీ.. బుల్లెట్ నడుపుతున్న ఎస్పీ నరసింహ కిశోర్

భవానీ మాలధారులకు నిత్యాన్నదానం

గోకవరం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): చందాలు లేవు, విరాళాలు సేకరించలేదు. అయినప్పటికీ గోకవరంలో భవానీ మాలధారులకు నిత్యాన్నదానం జరుగుతోంది. ఎంతమంది వచ్చినా లేదనుకుండా అన్నదానం చేస్తున్నారు. శ్రీవాసవీమాత ఆర్యవైశ్య కల్యాణ మండపం భవానీ భక్తులకు అక్షయపాత్రగా మారింది. శరన్నవరాత్రుల్లో భాగంగా తుమ్మలపల్లి వీరపండు, సంగుల శివ, పసుమర్తిప్రసాద్ బ్రదర్స్‌కు తోడుగా కొంతమంది అండగా నిలిచి అందిస్తున్నారు.

విద్యార్థి చదువు నిమిత్తం ఆర్థిక సాయం

ఉండ్రాజవరం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): చివటంకి చెందిన విద్యార్థి మడిపల్లి రిషీధర్ సీపీ ఫౌండేషన్ కోర్సు నిమిత్తం మానవత వాలంటీర్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ తణుకు శాఖ రూ.10 వేలు, పాలంగికి చెందిన పుల్లేశ్వరరావు మాస్టారు, అతని స్నేహితులు రూ.9800, రిటైర్డ్ టీచర్ రూ.10 వేలు, ఆర్యవైశ్య జర్నలిస్ట్ సంక్షేమ సంఘం రూ.12 వేలు, కే. వెంకటరమణ, బీ. దుర్గాప్రసాద్ కలిసి రూ.15 వేలు ఆర్థికసాయం చేశారు.

రెండోరోజుకు రైతుల శిక్షణ తరగతులు

పెరవలి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పెరవలిలో రైతులకు ఇస్తున్న శిక్షణ తరగతులు శుక్రవారంతో రెండోరోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పొలాలకు వెళ్లిన శాస్త్రవేత్తలు వరిపంటలో పురుగులు, తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పించారు. విజయవాడ సస్యరక్షణ అధికారి కే. వీర, అనిల్ కుమార్, బీ.బాబు, డీ. అమరేశ్వరరావు, పేర్రాజు, ఏవో మేరీకిరణ్, తదితర వ్యవసాయ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మెగా డీఎస్సీలో ఇంగ్లీష్ టీచర్‌గా ఉద్యోగం



ఎమ్మెల్యే చేతులమీదుగా నియామక పత్రం అందుకుంటున్న షేక్ హసీనా

నల్లజర్ల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో ఇంగ్లీష్ టీచర్‌గా ఉద్యోగం పొందిన నల్లజర్లకు చెందిన అంజాద్ ఆలీ భార్య షేక్‌హసీనా శుక్రవారం విజయవాడలో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు చేతుల మీదుగా నియామకపత్రం అందుకుంది. హసీనా భర్త అంజాద్ ఆలీ ప్రభుత్వ ఉద్యోగి, ఆయన తండ్రి విశ్రాంత ఉపాధ్యాయుడు. ఒకే కుటుంబంలో భర్త, మామ, తండ్రి ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేయడం ఆశ్చర్యంగా ఉందని పలువురు వారిని ప్రశంసిస్తున్నారు.

పోషణ మాసోత్సవాలు

దేవరపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారంతో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు మేలు జరుగుతుందని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి డీ.మమ్మీ అన్నారు. దేవరపల్లిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మమ్మీ మాట్లాడుతూ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17 నుంచి అక్టోబరు 16 వరకు పోషణ మాసోత్సవాలు నిర్వహించటం జరుగుతోందన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, అంగన్వాడీ టీచర్లు, కార్యకర్తలు, పిల్లలు, తదితరులు పాల్గొన్నారు.

వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్ స్థాపనకు కృషి : చైర్మన్



పూణేలో వేస్ట్ ఎనర్జీ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న చైర్మన్ ఆదినారాయణ

నిడదవోలు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నిడదవోలులోని డంపింగ్ యార్డులో ఉన్న చెత్తకు శాశ్వత పరిష్కారానికి వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నట్టు మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ తెలిపారు. పూణే నుంచి శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ నిడదవోలు పట్టణంలో ప్రతిరోజూ 20-30 టన్నుల చెత్త వస్తుందని, ఇప్పటికే డంపింగ్ యార్డులో గత 40 సంవత్సరాలుగా 70వేల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయి ఉందని, అందులో ఇప్పటికే కొంత శుద్ధీకరణ చేయడం జరిగిందన్నారు. పట్టణ ప్రజల నుంచి రోజు సేకరించిన చెత్త డంపింగ్ యార్డుకు చేరిన వెంటనే ఎనర్జీ ప్లాంట్ ద్వారా వినియోగించేలా చర్యలు తీసుకునేందుకు త్వరలో ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్నారు. దీనికి సంబంధించి సాంకేతిక నిపుణులతో సంప్రదించి అమలుకు చర్యలు చేపడతామన్నారు. ఆయనతో మునిసిపల్ ఏఈ హేమంత్ కుమార్ ఉన్నారు.

తాత్కాలిక లైసెన్సులకు దరఖాస్తు చేసుకోవాలి

కొవ్వూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా కొవ్వూరు డివిజన్ పరిధిలో బాణాసంచా వ్యాపారులు తాత్కాలిక లైసెన్సులకు దరఖాస్తు చేసుకోవాలని కొవ్వూరు ఆర్డీవో రాణీసుస్మిత తెలిపారు. అక్టోబరు 3వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ఆర్డీవో కార్యాలయంలో అందజేయాలన్నారు. దరఖాస్తుతో పాటు ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, చలానా ఒరిజినల్, దరఖాస్తుదారుడు జీఎస్టీ చెల్లించిన ఒరిజినల్ రసీదుపై ఏసీటీవో కార్యాలయం స్టాంప్ వేయించిన కాపీలను జతపరచాలన్నారు. 16వ తేదీ అనంతరం వచ్చే దరఖాస్తులు స్వీకరించబడవన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తాత్కాలిక లైసెన్సులు మంజూరుచేయడం జరుగుతుందన్నారు.

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు

పెరవలి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖండవల్లికి చెందిన తోట వెంకట సత్యనారాయణ అనే యువకుడు (18) కనిపించడం లేదని అతని తల్లి భవాని శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె వివరాలు తెలుపుతూ... తణుకులోని ఓ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడని, గురువారం సాయంత్రం ఆసుపత్రికి వెళుతున్నట్టు చెప్పి రాలేదని ఆమె పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

ఐదోరోజుకు దేవీశరన్నవరాత్రులు

● ప్రత్యేక అలంకరణల్లో దర్శనమిస్తున్న అమ్మవార్లు ● మహిళల ప్రత్యేక పూజలు



కొవ్వూరులో లక్ష్మీదేవి అలంకరణలో జ్ఞానసరస్వతి అమ్మవారు

కొవ్వూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా గోష్పాద క్షేత్రంలోని జ్ఞానసరస్వతి అమ్మవారు శుక్రవారం లక్ష్మీదేవిగా అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దీనిలో భాగంగా అర్చకులు కొండూరి మణికిరణ్ ఆధ్వ ర్యంలో చంద్రశేఖర్, కృష్ణవేణి దంపతులు చండీహోమం జరిపించారు. మహిళలు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు చేశారు. కార్యక్రమంలో కిష్టంపల్లి సీత, మల్లాది భ్రమరాంబ, మహంతి జ్యోతి, గంప దేవి, కొండూరి రమణ, సుబ్బలక్ష్మిలు పాల్గొన్నారు. అలాగే బాలాత్రిపుర సుందరి సమేత సుందరేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని మహాలక్ష్మీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అర్చకులు మానేపల్లి సుందర గణేష్ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమ పూజలు చేశారు. అలాగే ఆర్య వైశ్య కల్యాణ మండపంలో అధ్యక్షుడు నాళం శ్రీనివాసరావు పర్యవేక్షణలో మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

చాగల్లు: మండలంలో దేవీ నవరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. నెలటూరు గ్రామదేవత ముత్యాలమ్మ తల్లి లక్ష్మీదేవి అలంకరణలో శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. సుమారు రూ. రెండులక్షల కరెన్సీ నోట్లతో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. కోనేరు వీధిలోని కనకదుర్గమ్మ ఉత్సవాలు ముగింపు సందర్భంగా



గోపాలపురంలో మహాలక్ష్మీదేవి అలంకరణలో అమ్మవారు

అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. వల్లుగుంటలోని కనకదుర్గమ్మ వారి ఆలయంలో దసరా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. పాటెమ్మపేట పిడుంగొయ్యిలోని బాల కనకదుర్గమ్మవారి ఉత్సవాలు వేడుకగా నిర్వహిస్తున్నారు.

దేవరపల్లి: దేవీ నవరాత్రుల్లో భాగంగా దేవరపల్లిలోని ప్రధాన ఆలయాల్లో అమ్మవార్లను లక్ష్మీదేవిగా అలంకరించి ప్రత్యేకపూజలు, హోమాలు నిర్వహిస్తున్నారు. గ్రామంలోని మూడు బొమ్మల సెంటర్ వద్ద గల సౌభాగ్య దుర్గాంబిక బాలదుర్గమ్మ ఆలయంలోని అమ్మవారిని లక్ష్మీదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా గ్రామ పురోహితులు పెడసనిగంటి సాయిబాబు, శశికాంత్‌శర్మ మాట్లాడుతూ మూడుబొమ్మల సెంట ర్ వద్ద ఉన్న సౌభాగ్య దుర్గాంబిక ఆలయం 15వ వార్షికోత్సవాన్ని పూర్తి చేసుకుందన్నారు సుమారు 400 మంది భక్తులు పాల్గొన్నారు.

గోపాలపురం: దసరా ఉత్సవాల్లో భాగంగా స్థానిక అమ్మవారు ఐదోరోజు మహాలక్ష్మీదేవి అలంకరణలో శుక్రవారం దర్శనమిచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి దర్శించుకుని చక్కెర పొంగలి, క్షీరాన్నాన్ని నైవేద్యంగా సమర్పించారు.

నల్లజర్ల: పోతవరం చావా రామకృష్ణ రోడ్డులో జరుగుతున్న దసరా మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం రూ. 16 లక్షల కరెన్సీ నోట్లతో అమ్మవారిని అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. అలాగే వర సిద్ధి వినాయక సెంటర్‌లో విజయ దుర్గ యూత్ ఏర్పాటు చేసిన శిబిరం వద్ద భవానీలు నిప్పుల గుండం తొక్కారు. కార్యక్రమంలో పొంచిన పెద్ది సూర్యనారాయణ, నాతిరెడ్డి వినాయక, ఉన్నమట్ల హరికృష్ణ, ఉన్నమట్ల రాజు, గంటా శ్రీకాంత్, నక్కా సత్య నారాయణ, కండెపు శ్రీనివాస్, యర్రా గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాలు



గోపవరంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

నిడదవోలు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కుటుంబంలోని మహిళ ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబమంతా ఆరోగ్యవంతంగా ఉంటుందని టీడీపీ నేత ఆరేపల్లి చిన నంగాలు (ఏసీఎన్) అన్నారు. శుక్రవారం గోపవరంలో స్వస్త నారీ స్వసక్తి పరివార్ అభియాన్ (ఆరోగ్యవంతమైన మహిళ, శక్తి వంతమైన కుటుంబం) ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యమే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆరోగ్యవంతమైన మహిళ, శక్తివంతమైన కుటుంబం కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తూ మహిళల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తోందన్నారు. డాక్టర్ శ్రీనిధి రోగులను పరిశీలించి ఉచితంగా మందులు అందజేశారు. కమ్యూనిటీ హెల్త్‌ఆఫీసర్లు సీహెచ్ హరిత, పీ.సతీష్, కే.జ్యోత్స్న కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: పాలంగిలో శుక్రవారం స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. పీహెచ్‌సీ డాక్టర్ ఉషాదేవి పాల్గొని రోగులకు పరీక్షలు జరిపారు. అలాగే అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ కేడీఎల్ కుమారి, సూపర్‌వైజర్లు మేరీరత్న కుమారి, శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

పెరవలి: మహిళలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని కానూరు పీహెచ్‌సీ డాక్టర్ పీ. తేజశ్రీ పేర్కొన్నారు. స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తీపర్రులో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. మహిళలకు ముఖ్యంగా రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఉన్నందున ముందుగానే తగిన పరీక్షలు చేయించుకోవాలన్నారు. సర్పంచ్ కోటిపల్లి శ్రీదేవి, సొసైటీ అధ్యక్షుడు కంటిపూడి సూర్యనారాయణ, జనసేన నేతలు ప్రత్తిపాటి ప్రసాద్ కుమార్, కరుటూరి గోపాలకృష్ణ, కరుటూరి సుబ్బారావు, సిబ్బంది జయమణి, రాజా, కేవీ నాగేశ్వరరావు, అక్కమ్మ, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరులో ఘనంగా హిందీ దినోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, తదితరులు

కొవ్వూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేశంలో అత్యధికంగా మాట్లాడే భాష హిందీ అని కొవ్వూరు బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సత్యనారాయణ అన్నారు. శుక్రవారం కళాశాలలో హిందీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ హిందీ భాష నేర్చుకోవడం ద్వారా దేశమంతా ఎటువంటి ఇబ్బంది లేకుండా పర్యటించవచ్చునన్నారు. హిందీ అధ్యాపకుడు డా.అయినపర్తి మురళీకృష్ణ మాట్లాడుతూ 1949 సెప్టెంబరు 14న ఆర్టికల్ 343 ప్రకారం హిందీ భాషను అధికారిక భాషగా ప్రకటించడం జరిగిందన్నారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కేవీవీ సత్యనారాయణ, రిటైర్డ్ ఉపాధ్యాయుడు (అమలాపురం నుంచి) ఆర్.వెంకటేశ్వరరావు, నగరం నుంచి హుస్సేన్, రాజమహేంద్రవరం నుంచి పి.వివేక్ మాట్లాడుతూ హిందీ భాష గొప్పతనాన్ని వివరించారు. హిందీలో కబీరుదాసు, తులసీదాసు, సూరదాసు, మీరాబాయి, ప్రేమ్‌చంద్ వంటి వారు ఎన్నో రచనలతో అజరామరమైన సాహిత్యాన్ని అందజేశారన్నారు. అనంతరం ముఖ్యఅతిథులను శాలువాలు కప్పి సత్కరించారు. 2025 మార్చిలో జరిగిన పరీక్షల్లో 100కి 99 మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి



కొవ్వూరు మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సచివాలయ కార్యదర్శులు

కొవ్వూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సచివాలయ కార్యదర్శుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వారంతా నిరసన ప్రదర్శన చేపట్టారు. శుక్రవారం సాయంత్రం కొవ్వూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట పట్టణంలోని 10 వార్డులకు చెందిన సచివాలయాల కార్యదర్శులు నల్లబ్యాడ్జీలు ధరించి, ఫ్లకార్డులతో నిరసన చేపట్టారు. సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పట్టణ అధ్యక్షుడు ఎస్.కృష్ణభగవాన్ మాట్లాడుతూ తొమ్మిది నెలలు ఆలస్యంగా ప్రొహిబిషన్ డిక్లేర్ చేయడం వల్ల కోల్పోయిన ఆర్థిక ప్రయోజనాలు, రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు, ఆరు సంవత్సరాల సర్వీసు పూర్తయిన కారణంగా ప్రమోషన్ లేదా అడ్వాన్స్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, 10 శాఖలకు సంబంధించి 10 పనులు చెప్పడం వల్ల తీవ్ర మనోవేదనకు గురవుతున్నామన్నారు. ఇంటింటికి వెళ్లి వలంటీర్ల విధులు నిర్వహించడం ఉన్నతస్థాయి చదువులు చదువుకుని అగౌరవంగా భావిస్తున్నామన్నారు. ఇన్‌చార్జి శానిటరీ ఇన్స్‌పెక్టర్ అయినపర్తి రవి, ఆర్. రాజాదీప్, కేవీఎస్ అనిల్, విజయ్, లలిత, విజయ, నాగలక్ష్మి, రజియా, సుల్తానా, శ్రీదేవి, అయ్యప్పస్వామి, కార్యదర్శులు పాల్గొన్నారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై.. లోకేష్ మాట్లాడటం హర్షణీయం


కొవ్వూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేట్‌పరం కాదని శాసనమండలిలో మంత్రి నారా లోకేష్ మాట్లాడడం హర్షణీయమని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కన్వీనర్ బొంతా శ్యాం రవిప్రకాష్ అన్నారు. ఇదే ప్రకటనకు కట్టుబడి స్టీలు ప్లాంట్‌ను సందర్శించి ఉద్యోగుల జీతాలు తక్షణం విడుదల చేసేవిధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సంవత్సర కాలంగా సిబ్బందికి జీతాల్లేక ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. ముడిసరుకు అధికరేట్లకు కొనుగోలు చేయడం వల్ల కంపెనీ నష్టాల్లో కూరుకుపోయిందన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జీఎస్ఆర్‌కేఆర్ విజయకుమార్ నేతృత్వంలో ప్రైవేటీకరణ వ్యతిరేక పోరాట కమిటీతో కలిసి ముందుకు సాగుతామన్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో 32 మంది ప్రాణత్యాగం చేసి సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం కానివ్వమన్నారు. వారి త్యాగాలు వృథా పోనివ్వమన్నారు.

ఆలయాల అభివృద్ధికి ఏక కమిటీ

● తుమ్మలమ్మతల్లి ఆలయ ధర్మకర్త తలంశెట్టి కోటేశ్వరరావు

నల్లజర్ల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): చీపురుగూడెంలో ఎగువ, దిగువ తుమ్మలమ్మతల్లి ఆలయాల అభివృద్ధికి ఏక కమిటీని నియమించడం జరిగిందని దిగువ గుడి ధర్మకర్త తలంశెట్టి కోటేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ తనపై దిగువ గుడి చైర్మన్ అని చెప్పుకునే తలంశెట్టి శ్రీనివాస్ పదవీకాలం 2024 డిసెంబరులో ముగిసిందన్నారు. కాగా, తన వద్ద గుడికి సంబంధించిన సొమ్ములు రూ. లక్షా 50 వేలు ఉందని అసత్య ప్రచారం చేయడం తగదన్నారు. గ్రామస్థుల నిర్ణయం మేరకు గ్రామదేవత అందరికీ సమానమనే నిర్ణయంపై రెండుగుళ్లను ఏకం చేయడం జరిగిందన్నారు. దిగువ గుడికి సొంత సొమ్ములతో శంకుస్థాపన చేసి గుడి పునఃప్రతిష్ఠ చేయించానని, అప్పటినుంచి ఇప్పటి వరకు ఆలయ ధర్మకర్తగా అమ్మవారికి నిత్య దూపదీప నైవేద్యాలు జరిపిస్తున్నానన్నారు. 2023-24 సంవత్సరంలో కమిటీ చైర్మన్‌గా ఉన్న తలంశెట్టి శ్రీనివాస్ దగ్గర లక్షా 10 వేలు ఉన్నాయి. ఆ సొమ్ము లను అడిగితే సొంత ఖర్చులకు వాడుకున్నాను. తర్వాత ఇస్తానని అప్పటి నుంచి ఇప్పటి వరకు ఇవ్వలేదు. డిసెంబరు 2024లో శ్రీనివాస్ పదవీకాలం అయిపోయిందన్నారు. తదుపరి తన ఆధ్వర్యంలోనే పూజలు జరుగుతున్నాయన్నారు. రెండు గుడిల అభివృద్ధి కోసం ఏక కమిటీ వేయడంతో విభేదించిన శ్రీనివాస్ గుడికి తాళాలు వేశాడని. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. పోలీసుల సూచనల మేరకు ఏక కమిటీ తీర్మానాలను గ్రామస్థులు పాటిస్తున్నారని, ఇకనైనా గ్రామాభివృద్ధికి ఏక కమిటీలో కలిసి సహకరించాలని కోరారు.

ప్లాస్టిక్ వాడకాన్ని మానేయాలి : శేషారావు



వేలివెన్నులో గుడ్డసంచులను అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే శేషారావు

ఉండ్రాజవరం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ వాడకాన్ని మానివేయాలని ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పేర్కొన్నారు. వేలివెన్నులో గ్రామ ఉప సర్పంచ్, పెరవలి డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్ బూరుగుపల్లి శ్రీనివాసరావు తన పుట్టిన రోజు సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ ఉచితంగా రెండేసి క్లాత్ బ్యాగ్స్ పంపిణీ కార్యక్రమాన్ని శేషారావు చేతులమీదుగా శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శేషారావు మాట్లాడుతూ ఇంటింటికీ రెండు చొప్పున గుడ్డ సంచులు ఉచితంగా అందించడం అభినందనీయమన్నారు. ప్రజలు ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కోరారు. ఉపసర్పంచ్, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ బూరుగుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు కాలుష్యరహిత వాతావరణాన్ని కల్పించాలనే ఉద్దేశంతో వేలివెన్నులో ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ వస్తువులను నిషేధించామన్నారు. ఈ సందర్భంగా పలువురు శ్రీనివాసరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో వీఎస్ రామారావు, సర్పంచ్ అత్తిలి సత్యనారాయణ, ఐటీడీపీ నిడదవోలు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్బిశెట్టి సత్తిరాజు, పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో కొనుగోళ్లు పెరిగాయి

● బీజేపీ ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షుడు దున్నా సుమన్‌బాబు



దేవరపల్లి బస్టాండ్ ఆవరణలో మొక్క నాటుతున్న బీజేపీ నాయకులు

దేవరపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్రం జీఎస్టీని తగ్గించటం వల్ల పేదప్రజల కొనుగోళ్లు పెరిగాయని బీజేపీ ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షుడు దున్నా సుమన్ బాబు పేర్కొన్నారు. దేవరపల్లిలో బస్టాండ్ ఆవరణలో శుక్రవారం మోదీ పుట్టినరోజు పక్షోత్సవాల్లో భాగంగా మొక్కలు నాటారు. కార్య క్రమంలో బీజేపీ నాయకులు నిమ్మగడ్డ శ్రీను, ఎస్.వెంకటేశ్, ముప్పిడి భాస్కర్ కుమార్, ఓరుగంటి వెంకటపతిరాజు, తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల మండలంలో నత్తల గోల

● రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న వైనం



ఆవపాడులో నిమ్మ చెట్టుకు పట్టిన నత్తలు

నల్లజర్ల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో నత్తల విజృంభించి పంటలు, తోటలను పీల్చి పిప్పి చేస్తున్నాయి. ఆఫ్రికా నత్తలు ఆవపాడు, శింగరాజుపాలెం, ముసుళ్ళకుంట, పుల్లలపాడులోని నిమ్మ, ఆయిల్‌పామ్, కొబ్బరి, కోకో, కూరగాయల పంటలను నష్టపరుస్తున్నాయి. ఎన్ని పురుగుమందులు పిచికారీ చేసినా ఫలితం లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ అధికారులు, ఉద్యాన అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోతోంది. కూలీల సహాయంతో వాటిని తొలగిస్తున్నప్పటికీ మరుసటి రోజు మళ్లీ యథావిధిగా వచ్చేస్తున్నాయి. ప్రధానంగా నిమ్మచెట్లు ఎండిపోతున్నాయి.